
Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల




Vol. 31 - No.3

January 2025



5 లో

## సమకాలీన సంస్కృతిలో క్రైస్తవ్యము

ఎడిటోరియల్

# నిండుమనస్సుతో వెంబడిద్దాం

కొందరి జీవిత ప్రారంభం మంచిగా ఉన్నా ముగింపు సరిగా ఉండదు. కొందరికి ప్రారంభం మంచిగా లేకున్నా ముగింపు మంచిగా ఉంటుంది. మరికొందరికి ప్రారంభం, ముగింపు మంచిగా ఉండవు. కొందరికి ప్రారంభం, ముగింపు మంచిగా ఉంటాయి. దీనికి ఒక మంచి ఉదాహరణ కాలేబు జీవితం. ఇటువంటి జీవితానికి కారణం కాలేబు దేవున్ని నిండుమనస్సుతో వెంబడించడమే.

85 సంవత్సరాల కాలేబు "నేను నిండుమనస్సుతో దేవుని వెంబడించానని" తనగురించి తాను చెప్పుకున్నాడు (యెహో 14:8). ఇదే విషయాన్ని దైవజనుడైన మోషే చెప్పాడు (యెహో 14:9) తన తోటివాడైన యెహోషువ చెప్పాడు (యెహో 14:13), దేవుడు కూడా సాక్ష్యమిచ్చాడు (సంఖ్యా 14:24). దేవున్ని వెంబడించే విషయంలో కాలేబులో రెండు తలంపులు లేవు, సంపూర్ణ విధేయత, విశ్వాసము మాత్రం మెండుగా ఉన్నాయి.

*కాలేబు దేవుని ఆజ్ఞకు విధేయత చూపించాడు.* నిండుమనస్సుతో దేవున్ని వెంబడించాలన్నది దేవుని ఆజ్ఞ. ద్వితీ 6:5; 10:12లో చూస్తే "కాబట్టి ఇశ్రాయేలూ, నీ దేవుడైన యెహోవాకు భయపడి ఆయన మార్గములన్నిటిలో నడుచుచు, ఆయనను ప్రేమించి, నీ దేవుడైన యెహోవాను నీ పూర్ణమనస్సుతోను నీ పూర్ణాత్మతోను సేవించాలి..". తన తోటి ఇశ్రాయేలీయులు ఎలా ఉన్నా కాలేబు మాత్రం దేవుని ఆజ్ఞకు లోబడి పూర్ణమనస్సుతో దేవున్ని వెంబడించాడు.

*కాలేబు ప్రత్యేకంగా జీవించాడు.* 40 సంవత్సరాల అరణ్య ప్రయాణంలో ఇశ్రాయేలీయులు దేవునికి, మోషేకి 10 సందర్భాల్లో వ్యతిరేకంగా ప్రవర్తించారు (సంఖ్యా 14:22). చెడ్డవాటిని ఆశించారు, దేవున్ని శోధించారు, సణిగారు, తిన్నారు, తాగారు, తిరుగుబాటు చేశారు, ఆడారు, అవిధేయత చూపించారు, విగ్రహారాధన చేశారు, వ్యభిచారులుగా ఉంటూ దేవునికి ఇష్టులుగా జీవించలేకపోయారు. ఈ సందర్భాలన్నిటిలో కాలేబు, యెహోషువలు సణిగినట్లు, తిరుగుబాటు చేసినట్లు, అవిధేయత చూపినట్లు, విగ్రహారాధన చేసినట్లు ఎక్కడ చెప్పలేదు. తోటివారు దేవునికి, దేవుడు ఏర్పాటు చేసిన నాయకులకు వ్యతిరేకంగా నడిచినా, తిరుగుబాటు చేసినా కాలేబు వారిలో ఎక్కడా చేరక ప్రత్యేకంగా జీవించాడు.

*కాలేబు దేవుని ప్రణాళిక, వాగ్దానం పట్ల సంపూర్ణ విశ్వాసం చూపించాడు.* ఇశ్రాయేలీయుల్ని పాలుతేనెలు ప్రవహించే దేశానికి తీసుకువెళ్ళాలనేది దేవుని ప్రణాళిక (నిర్గమ 3:8.7). ఇది నెరవేరడానికి 40 సంవత్సరాలు పట్టింది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో క్లిష్టమైన సమస్యలు, యుద్ధాలు ఎదురైనాయి. వీటన్నిటిలో తన దేవుడు వాగ్దానాన్ని నెరవేరుస్తాడని కాలేబు ప్రగాఢంగా విశ్వసించి, కనానుకు వేగు వెళ్ళి తాను సేకరించిన మంచి సమాచారాన్ని ఇచ్చాడు (సంఖ్యా 14:8). జన ప్రియంగా, జనరంజకంగా ఉండాలని అనుకోలేదు. ఫలితంగా వాగ్దాన భూమిలో ప్రవేశించిన ఇద్దరిలో ఒకడయ్యాడు. ఎప్పుడూ సణుగుతూ, తిరుగుబాటుచేస్తూ, ఆహారం గురించి ఆలోచించిన వారు దేవుని ప్రణాళికలు, వాగ్దానాలను అర్థం చేసుకోక అరణ్యంలో దేవుని శిక్షకు గురయ్యారు.

*యెహోషువ నాయకత్వంలో పని చేశాడు.* తన సమకాలీకుడైన యెహోషువను దేవుడు ఇశ్రాయేలీయులకు నాయకుడిగా ఎంచుకున్నప్పుడు అతని అదుపాజ్ఞల్లో పనిచేయడానికి ఏమాత్రం వెనుకాడలేదు. మోషేకు తన సమకాలీకుల్లో నాయకత్వం విషయంలో చాలా సమస్యలు ఎదురయ్యాయి. కోరహు, దాతాను, అబీరాములే గాక అతని స్వంత తోబుట్టువులే అతని నాయకత్వంపై అలజడి రేకెత్తించారు. యెహోషువకైతే కాలేబు నుంచి ఎటువంటి ఇబ్బంది వచ్చినట్లు కనిపించదు.

*కాలేబు దేవుని మీద ఆధారపడ్డాడు (యెహో 14:12).* 85 సంవత్సరాల వయస్సు అంటే సమాధికి వెళ్ళడానికి సిద్ధంగా ఉండాల్సిన వయస్సు. కానీ ఈ వయస్సులో కూడా 'ఈ కొండ ప్రాంతాన్ని నాకు దయచేయి, దేవుడు నాకు తోడుగా ఉంటే అనాకీయుల దేశాన్ని స్వాధీనం చేసుకుంటానని యెహోషువాతో చెప్పి దాన్ని ధైర్యంతో, విశ్వాసంతో, దేవుని సహాయంతో స్వాధీనం చేసుకున్నాడు. "యవ్వనం ఒక పెద్ద పొరపాటు, మధ్యవయసొక పోరాటం, వృద్ధాప్యం ఓ విషాదం" అని అంటాడు మాజీ బ్రిటన్ ప్రధాని బెంజిమిన్ డిస్రేలి. కానీ కాలేబు విషయంలో యవ్వనం ఓ ఉత్సాహం, మధ్యవయస్సు ఓ నమ్మకత్వం, వృద్ధాప్యం ఓ బలం. "యెహోవా కొరకు ఎదురు చూచువారు నూతన బలము పొందుదురు" అనే మాట కాలేబు జీవితంలో అక్షర సత్యం.

"మంచిగా ప్రారంభించడం క్షణికమైన విషయం, మంచిగా పూర్తి చేయడం జీవితకాలపు విషయం" అని అంటాడు డా.రవిజకర్యాస్. కాలేబు నిండు మనస్సుతో దేవుని వెంబడించి తన జీవితాన్ని మంచిగా ప్రారంభించి, మంచిగా ముగించాడు. మనం కూడా కాలేబులా జీవించి ఈ నూతన సంవత్సరంలో మంచి ముగింపు కోరుకొందామా!

**– పి. సునీల్ జాకబ్,** అసోసియేట్ ఎడిటర్



# విద్యార్థి జ్వాల


Vol. 31, No. 3. January 2025
A Publication of
Union of Evangelical Students of India



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Editor
Mr. P. Sunil Jacob - Associate Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.



SUBSCRIPTION CHARGES:

STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-

FOR SUBSCPRICTION:

The prescribed subscription charges can be paid using the account / UPI id / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account Name : UESI Publication Trust, Andhra Pradesh**
**Account No : 43362371247,**
**SBI Nambur Branch**
**IFSC: SBIN0011994**
**Merchant Name: UESI PUBLICATION TRUST ANDHRA PRADESH**
**UPI ID : uesiptap@sbi**



CONTACT:

The Editor
Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com


## కొత్తసంవత్సరంలో
# కొత్తదనం

"ప్రతిరోజూ ఒక కొత్త రోజు
ముందెన్నడూ రాలేదు ఈ రోజు
మరెన్నడూ రాబోదు ఈ రోజు
ప్రత్యేకమైన కొత్త రోజు
ఆనందముగా జీవించాలి ఈ రోజు
క్రీస్తు కొత్తదనము ధరించాలి ప్రతి కొత్త రోజు
ప్రతి కొత్త రోజూ ప్రభువుకు మహిమే..."

అని పాడుకొంటూ, దేవా! ఈ నూతన సంవత్సరంలో నన్ను నూతన పరచుము, నీ నూతన కార్యాలు నా యెడల జరిగించుమని ప్రతిరోజు ప్రార్థన చేసుకొంటూ, ప్రతిరోజూ ప్రభువుకు లోబడుతూ, కొత్తదనంతో జీవిస్తూ ఈ సంవత్సరమంతా సాగిపోదాం.

విద్యారి జ్వాల పాఠకులందరికీ
## నూతన సంవత్సర శుభాకాంక్షలు

## లోపలి పేజీల్లో...


- నిండు మనస్సుతో వెంబడిద్దాం - 2
- అకుంఠిత దీక్ష - అలుపెరుగని పరిశ్రమ - 4
- సమకాలీన సంస్కృతిలో క్రైస్తవ్యము - 5
- కళాశాల ప్రాంగణాలలో సవాళ్ళు - 9
- ప్రెషర్ కుక్కర్ జీవితాలు - 12
- పవిత్రీకరణ - 16
- 1:2 గ్రాడ్యుయేట్ సెల్ - 20
- ఆత్మీయ ఎదురీత - 22
- లే! మేలుకో! పనిని చేపడదాం - 23
- కృతజ్ఞతతో జీవించడం - 24
- క్రీస్తును వెంబడించు - 27
- నూతన పరచుము - 28
- మన లక్ష్యం - 31
- జాగ్రత్త - జర జాగ్రత్త - 32

# అకుంఠిత దీక్ష - అలుపెరుగని పరిశ్రమ

## అందనంత ఎత్తుకి సూత్రాలు

ఏడు సంవత్సరాల వయస్సులోనే చదరంగంలో (చెస్) అడుగుపెట్టి, పద్దెనిమిది సంవత్సరాలకే ప్రపంచ ఛాంపియన్ అయిన గుకేష్ జీవితాన్ని పరిశీలిస్తే అకుంఠిత దీక్ష, అలుపెరుగని పరిశ్రమ, అహర్నిశలు శ్రమించడం తన అనుదిన జీవితంగా మారాయని అర్థమవుతుంది. అవే తనను అందనంత ఎత్తుకి తీసుకొని వెళ్ళాయి. అతి పిన్న వయసులో అతి పెద్ద ఘనతను సాధించేందుకు సాధనాలయ్యాయి. యావత్ భారతదేశం గర్వించే విధంగా తనను తీర్చిదిద్దాయి.

ప్రస్తుత పరిస్థితుల్లో క్రీస్తుని ప్రతిబింబించే ఆధునిక గుకేష్‌లు కావాలి. నూతన సంవత్సరంలోకి అడుగిడిన మనం – దేవుడు మనకిచ్చిన బాధ్యతల్లో, ఆయా రంగాల్లో విజయపథంలో పయనించాలంటే ఈ మూడు విషయాలు కలిగి ఉండాలి.

నూతన ఆశయాలు

నూతన అలవాట్లు

నూతన అంతస్తు

**నూతన ఆశయాలు:** నూతన సంవత్సరంలో నూతన ఆశయాలు ఏర్పరచుకొని వాటి కోసం శ్రమించాలి.

**నూతన అలవాట్లు:** నూతన ఆశయాలను నెరవేర్చే ప్రక్రియలో నూతన అలవాట్లను అభ్యసించాలి.

**నూతన అంతస్తు:** నూతన అభ్యాసం క్రమంగా నూతన అంతస్తులోకి తీసుకొని వెళ్తుంది.

ఏదైనా రంగంలో అభివృద్ధిని సాధించాలంటే అది ఒకరోజులో, ఒక ప్రయత్నంతో, ఒకేసారి సాధించలేకపోవచ్చు. కానీ పదే పదే ప్రయత్నించినప్పుడు అనుకున్నది సాధిస్తాం. సాధనమున పనులు సమకూరు ధరలోన అనేది సాధించి చూపించాలి. అది మనమే చేయగలం. ప్రభువుతో పరిచయం లేని అవిశ్వాసులే అనితర సాధ్యాలను సాధిస్తున్నప్పుడు ప్రభువు పిల్లలమైన మనం తప్పక సాధించగలం.



ఏదైనా ప్రారంభించడానికి మనం గొప్పవాళ్ళం కానక్కరలేదు. కానీ గొప్పవాళ్ళం కావడానికి ప్రారంభించాల్సిందే. గనుక తప్పక ప్రారంభించి గొప్పవాళ్ళమవుదాం. మన గొప్ప దేవుని ఉద్దేశాలు మన పట్ల గొప్పగా ఉంటాయి గనుక గొప్పగా ప్రయత్నించి ప్రారంభిద్దాం. వ్యక్తులు చొరవ తీసుకోవడం వ్యవస్థలకు ఆశీర్వాదం. గనుక నూతన ఆశయాలను నూతన సంవత్సరంలో నూతన చొరవతో ప్రారంభించి నూతన అంతస్తును అధిరోహిద్దాం. అద్వితీయుని అభిలాషను నెరవేరుద్దాం. మన అభివృద్ధి దేశానికి ఆశీర్వాదం మాత్రమే కాదు, దేవునికి ఆనందం తీసుకు రావాలి. దేశం, దేవుడు గర్వపడే విషయాలు సాధించి నూతన అంతస్తులోకి పయనించాలని కోరుకొంటూ....

నూతన సంవత్సర శుభాకాంక్షలతో...

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ–ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



# సమకాలీన సంస్కృతిలో క్రైస్తవ్యము

కాలాతీతమైన క్రైస్తవ సత్యాన్ని మారుతున్న కాలానికి ఎలా అందించాలి? అనే ప్రశ్న మనముందున్న పెద్ద సవాలు. సంవత్సరాలు గడిపోతున్నాయి, తరాలు మారుతున్నాయి, సమాజము మారుతుంది, ట్రెండ్స్ కూడా ఎప్పటికప్పుడు మారుతున్నాయి. అయితే, స్థలానికి, సమయానికి అతీతుడు, మార్పు లేని యేసు ప్రభువు మనలను విమోచించడానికి కాలంలోకి, చరిత్రలోకి, మానవ సంస్కృతిలోకి వచ్చాడు. దేవుడే మానవుడిగా మారాడు కాబట్టి, “సువార్త ఏ సంస్కృతిలోనైనా ఇమిడి పోగలదు. అంతే కాకుండా అది ప్రతి సంస్కృతిని సవాలు చేస్తుంది” ఆండ్రూ వాల్స్ అనే ప్రముఖ మిసియాలజిస్ట్ వ్యాఖ్యానిస్తాడు. ఆయన మానవ సంస్కృతిని సీరియస్‌గా తీసుకొన్నాడు. గనుక మనము గమనించాల్సింది మారుతున్న తేదీలను కాదు గానీ మారుతున్న ట్రెండ్స్, సంస్కృతిని. దేవుని చారిత్రక విమోచన చరిత్రలో మనము ఏ కాలములో ఉన్నామో, ఏ స్థలములో ఉన్నామో ఏ సంస్కృతిలో ఉన్నామో అర్థం చేసుకోవడం చాలా ఆవశ్యకం.

‘లేఖనం మాత్రమే’ అని చెప్పుకొనే మనము సంస్కృతిని ఎందుకు చదవాలి? ఎందుకు అర్థం చేసుకోవాలనే ప్రశ్నలు మనకు తలెత్తుతాయి. సంస్కృతిని అర్థం చేసుకోవడానికి నేనెందుకు నా సమయాన్ని, నా సామర్థ్యాన్ని వెచ్చించాలి అనే ప్రశ్న కూడా మనకు తలెత్తవచ్చు. అటువంటి ప్రశ్నలకు సమాధానంగా “నువ్వు దేనికైనా భాష్యం లేదా అర్థం చెప్పాలనుకొంటే మొదటిగా అదేమిటో నువ్వు అర్థం చేసుకోవాలని” సియస్ లూయిస్ చెబుతాడు. మనము కల్చర్‌ని మొదటగా అర్థం చేసుకొంటేనే ప్రభావవంతంగా సువార్త పనిని చేయగలము. సంస్కృతిని అర్థం చేసుకోవడానికి ఈ మూడు విషయాలు జాగ్రత్తగా గమనించాలి. 1. సంస్కృతిని నేనెందుకు చదవాలి? 2. సంస్కృతి అంటే ఏంటి? అదేమి చేస్తుంది? 3. సంస్కృతిని మనం ఎలా అర్థవంతంగా అర్థం చేసుకొని జీవించగలం?

## 1. సంస్కృతిని నేనెందుకు చదవాలి?

### 1. మనము పరిచర్య చేస్తున్న విద్యార్థి లోకము గురించి తెలుసుకోవడానికి

మనం సేవ చేస్తున్న విద్యార్థులు ఈ లోకంలో జీవిస్తున్నారు గనుక వారిని గూర్చి తెలుసుకోవడానికి, వారు లేఖనాలతో, వేదాంతంతో సంబంధం లేకుండా ఉండడానికి ఆటంకాలు ఏమి ఉన్నాయో గ్రహించాలంటే వారి యొక్క సంస్కృతిని అర్థము చేసుకోవాలి. జెఫ్రీ బిబ్రో అనే రచయిత ‘రీడింగ్ ద టైమ్స్’ అనే పుస్తకాన్ని రాశాడు. న్యూస్ పేపర్ అనే పదము లేనప్పుడే యేసుక్రీస్తు “కాలాన్ని అర్థం చేసుకోవడం” యొక్క ప్రాముఖ్యతని బోధించాడు. ఆయన పరిసయ్యులు శాస్త్రులతో “మీరు ఆకాశ వైఖరిని వివేచింప ఎరుగుదురు గానీ ఈ కాలముల సూచనలను వివేచింపలేరు” అని అన్నాడు (మత్తయి 16:3). కాలముల సూచనలు అంటే ‘ఒక నిర్దిష్ట కాలానికి సంబంధించిన ఆలోచనలు, నమ్మకాలు, వ్యక్తులు, విషయాలు’. మనము విద్యార్థులను చేరుకోవాలన్నా, సత్యాన్ని ప్రభావవంతంగా



**ఈ రోజుల్లో ఎక్కువగా కనపడుచున్న పోకడ ఏంటంటే రాత్రికి రాత్రే ఫేమస్ అవ్వాలి, మనుష్యులు మనం చేసేదానిని పొగడాలి, మన గురించి అందరూ గొప్పగా చెప్పుకోవాలనే తాపత్రయం విపరీతంగా కనబడుతుంది. అందుకే వారు చేసే ప్రతి పనిని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ప్రశంసల కోసం ఎదురు చూస్తున్నారు. క్రైస్తవ్యంలోకి కూడా ఈ సంస్కృతి బలంగా చొచ్చుకొచ్చింది.**

అందించాలన్నా తప్పని సరిగా వారి కల్చర్, సాంస్కృతిక నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలి. అయితే, విద్యార్థుల జీవన విధానాన్ని అర్థం చేసుకోవడానికి మనం ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నాము అనేది మనముందున్న ప్రశ్న. ప్రస్తుతం ప్రపంచ సంస్కృతి మన విశ్వాసాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది అనే దాన్ని గూర్చి కూడా చదవాలి, అర్థం చేసుకోవాలి.

### 2. విద్యార్థుల జీవితాలను సంస్కృతి రూపొందిస్తుంది లేదా తయారుచేస్తుంది

"పరిశుద్ధాత్ముని తర్వాత ఆత్మీయతను రూపొందించే చాలా శక్తివంతమైన సాధనం సంస్కృతి" అని కెవిన్ వాన్‌హూజర్ అనే వేదాంతి అభిప్రాయపడతాడు. మన పరిచర్యలో, సహవాసంలోని విద్యార్థులను ఎలాంటి సంస్కృతి ప్రభావితం చేస్తుంది? ఎలాంటి సంస్కృతి చేత నిర్మించబడుతున్నాము అనే అవగాహనను కలిగియుండడం అవసరం. ఎంతమేర మన చుట్టూ ఉన్న సంస్కృతి యొక్క అలవాట్లు, ఆచారాలు, మంచి లేదా చెడు మనలోకి, పరిచర్యలోకి చొరబడ్డాయనే ప్రశ్నలు మనము సంధించుకోవాలి.

### 3. మన సంస్కృతిలో మనము వేటిని అంగీకరించాలి వేటిని తిరస్కరించాలనే వివేచన కోసం

సంస్కృతి అంటే నాకు ఇష్టం లేదనే ధోరణి అనేక మంది విద్యార్థులను మనకు దూరం చేస్తుంది. సంస్కృతిని నిర్లక్ష్యం చేస్తే అది గ్రుడ్డితనంతో కూడిన భావన అవుతుంది. కొన్ని క్రైస్తవ సంఘాలు సంస్కృతితో రాజీపడి కొన్ని లేఖన విరుద్ధమైన భావనలను సంఘంలో అనుమతిస్తున్నారు. ఉదా. గే వివాహాలు, డేటింగ్. అలా చేస్తే అది సంస్కృతితో రాజీపడినట్లు అవుతుంది గానీ సంస్కృతిలో చెడు విషయాలను ఖండించినట్లు అవ్వదు. కొంతమంది ఈ సంస్కృతిని పూర్తిగా నాశనము చేసి విదేశీ ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రతిపాదిస్తారు. అది కూడా అంత ఆరోగ్యకరమైన భావన కాదు. క్రైస్తవ్యము భూ సంబంధమైన సంస్కృతిని నాశనము చేయదు గానీ దానిని రూపాంతరము చేస్తుంది. గనుక విద్యార్థులకు సమకాలీన సంస్కృతి పట్ల ఎలాంటి ఆధ్యాత్మిక వైఖరిని అవలంబించాలి అనే విషయములో మనము సహాయం చేయాలి.

### 4. సంస్కృతి ఒక భక్తి/ఆరాధన లాంటిది

సంస్కృతి కూడా వేదాంతంలాగానే, జీవిత ఉద్దేశం ఏంటి? ఆనందానికి మార్గము ఏంటి? వంటి క్లిష్టమైన ప్రశ్నలతో కుస్తీ పడుతుంది. వాటికి సమాధానం వెదికే క్రమంలో అనేకమైన వాటిలో సంతోషాన్ని వెదకుతారు, అందులో చాలా ప్రయత్నాలు, పద్ధతులు విగ్రహారాధనలాంటివి. ఉదాహరణకు మనము ఎక్సలెన్స్‌ని సాధించే క్రమంలో మనము ఎక్సలెన్సని/పనిని ఆరాధించకూడదు. అలా చేస్తే అది విగ్రహారాధన అవుతుంది. కొంతమందికి యోగా/ఎక్సర్‌సైజ్, స్టడీస్, మినిస్ట్రీ, ఫ్యామిలీ కూడా ఒక డైలీ డివోషన్ అయిపోతుంది.

### 5. విద్యార్థులను సాంస్కృతిక అక్షరాస్యులుగా ఉండేలా తయారు చేయడం కోసం

విద్యార్థులను కల్చర్‌ని చదవగలిగే వారిగా చేయడం ద్వారా తమ ప్రభావాన్ని కల్చర్ మీద చూపించగలరు. లేకపోతే కల్చర్ వారిమీద ప్రభావం చూపిస్తుంది. విశ్వాస విద్యార్థులు సంస్కృతిని సరిగ్గా అర్థం చేసుకోవడానికి మనం కొన్ని సూత్రాలను అభివృద్ధి చేయాలి. మనము లేఖనాన్ని చదివే విధముగానే సంస్కృతిని కూడా వారు బాగా చదవగలిగేటట్లు తయారు చేయాలి. ఒకవేళ లేఖనాన్ని ప్రస్తుత ప్రపంచానికి అన్వయించకపోతే అది అంత ప్రయోజనకరంగా ఉండదు.

### సంస్కృతి అంటే ఏంటి?

కల్చర్ అనే ఇంగ్లీష్ పదాన్ని లాటిన్‌లో 'కల్చుర' అంటారు. దీని అర్థం 'సాగుచేయడం, సంరక్షణ, పోషించడం'. 15వ శతాబ్దంలో దాని అర్థం వ్యవసాయ రంగానికి సంబంధించినది. తర్వాత దీని అర్థం మారింది. 'భూమి, భాష, సంప్రదాయాలు కలసి రూపొందించిన ప్రజల జీవన శైలినే సంస్కృతి'

అని హోర్డర్ అంటాడు. ప్రజలు ప్రతిదానిని అసంకల్పితముగా చేయరు. ఇది మనమందరమూ కలసి తయారు చేసే ప్రపంచం. మన యొక్క స్వేచ్ఛ, హృదయం, సృజనాత్మకత యొక్క ఫలితమే సంస్కృతి.

ఆచారాలు, ఆహారం, పద్ధతులు, వస్త్రధారణ, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు, సినిమాలు, మ్యూజిక్, కట్టడాలు, ఆన్‌లైన్ గేమ్స్ ఇవన్నీ కల్చర్‌లో భాగమే. మనందరం వీటిలో భాగంగా ఉన్నాము.

## కల్చర్ చేసే పని

### 1. సంస్కృతి దిశానిర్దేశం చేస్తుంది

మనము ఎక్కడ ఉన్నాము, ఎక్కడికి వెళ్ళాలి, ఎక్కడికి వెళ్ళాలని అనుకొంటున్నాము, మన చుట్టూ ఏమి జరుగుతుంది అనే విషయాలను చెప్పే ఒక మ్యాప్ లాంటిది. మనము సామాజికంగా పంచుకొనే విషయాల ద్వారా మన యొక్క మార్గాలను తయారు చేసుకొనేలా లేదా రూపొందించుకోవడంలో సహాయం చేస్తుంది.

సమాజ సంస్కృతి కోణంలో చూస్తే ఉద్యోగం లేదా డబ్బు ఎలా సంపాదించాము అన్నదే ప్రాముఖ్యం. నువ్వు లంచమిచ్చావా, ఫేక్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ పెట్టావా, ఆన్లైన్ ఇంటర్వ్యూలో మోసము చేసి ఉద్యోగం సాధించావా అనేది అనవసరం. కేవలం సక్సెస్ మాత్రమే ముఖ్యం అని బోధిస్తుంది. అయితే క్రైస్తవ కోణం ఏంటంటే మన జీవితాల యొక్క అంతిమ లక్ష్యము విజయం కాదు గానీ దేవునికి నమ్మకంగా జీవించడం.

### 2. సంస్కృతి సాగుచేస్తుంది

సంస్కృతి మన నమ్మకాలను, పనులను, అలవాట్లను నిర్మిస్తుంది, మన హృదయాలను అది రూపొందిస్తుంది. ప్రతి సంస్కృతి కూడా ఒకరకమైన మతపరమైన బోధన చేస్తుంది. సంస్కృతి మన హృదయాలను, స్వేచ్ఛను, అంతరంగిక ఆశలను నిర్మిస్తుంది. ఉదా. నా జీవితం, నా జీతము, నా ఉద్యోగం నా కుటుంబం కోసం, నా పిల్లల కోసం, నా ఇల్లు అనే స్వార్థపూరితమైన భావనను సంస్కృతి మనలోకి చొప్పించడానికి ప్రయత్నిస్తుంటుంది. జెండర్ గురించి, సెక్స్ గురించి, వివాహము గురించి వక్రీకరించబడిన నమ్మకాలను సంస్కృతి బోధిస్తుంది. స్వలింగ సంపర్కం తప్పుకాదు ఎందుకంటే అది నీ తప్పుకాదు, అది హార్మోన్స్ సమస్య. నీ భావోద్రేకాలు నీ లింగాన్ని నిర్దేశించాలి అనే ఒరవడిని ఈ రోజుల్లో గమనిస్తున్నాం. దానిని సర్వోన్నత న్యాయస్థానం కూడా వింతేమీకాదని సమర్థిస్తుంది.

మనముందున్న ప్రశ్న ఏంటంటే మన సంస్కృతి ఎటువంటి హృదయాన్ని మనలో రూపొందిస్తుంది? అది క్రైస్తవ హృదయమా? క్రూర, ద్వేషపూరిత హృదయమా? పెట్టుబడీదారీ హృదయమా? నైతికంగా పతనమయ్యే హృదయమా?

### 3. సంస్కృతి మనల్ని నడిపిస్తుంది

కల్చర్ అనేది అనేక స్టోరీస్‌ని చెబుతూ ఉంటుంది. ఆ స్టోరీలు మనము ఎలా జీవించాలి అనేదానికి మార్గదర్శకంగా పని చేస్తుంటాయి. ఈ రోజుల్లో సోషల్ మీడియా, టివి, పాడ్‌కాస్ట్, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ లాంటి మాధ్యమాలు 24/7 మన దృష్టిని ఆకర్షిస్తూ, మంచి దృశ్యాలను ఇస్తూ, వాటి ఆధీనంలోకి వెళ్ళేలా చేస్తున్నాయి. అందుకే మన ప్రతి ఆలోచనను చెరపట్టి క్రీస్తు యొద్దకు తీసుకొని రావాలని పౌలు చెబుతున్నాడు. దానికి బదులుగా మన ఆలోచనలు లౌకిక సామాజిక ఊహలతో చెరపట్ట బడుతున్నాయి. కాబట్టి మనము కొన్ని అంశాలు సహజ సిద్ధమైనవే అని భావించేలా చేసి, కొన్ని అంశాలు అసహజ సిద్ధమైనవని భావించేలా పురికొల్పుతుంది.

ఇప్పుడు మనము ట్విటర్, ఫేస్‌బుక్, కామెంట్స్‌లలో ఎక్కువ లైంగికంగా ప్రేరేపించే చిత్రాలు, కామెంట్స్‌ను చూస్తున్నాము. ఈ రోజుల్లో వస్తున్న సంగీతం అర్థం లేనిదిగా ఉంటుంది. స్త్రీ యొక్క శరీరభాగాలను వర్ణిస్తూ లైంగికమైన ప్రేరేపణలు పుట్టించే సంగీతం, పాటలు వస్తున్నాయి. ఒక సర్వే ప్రకారం ఎక్కువమంది విద్యార్థులు, యువత విషాద గీతాలను వినడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇంటర్నెట్ అసభ్యకరమైన ఫొటోస్, సందేశాలతో అనుదినం మన మనస్సులను బెంబేలెత్తిస్తుంది. మనకు ఆధ్యాత్మిక స్పృహ లేకపోతే మనలను వాటికి బానిసలునుగా చేస్తాయి. దృశ్య



సంబంధమైన ఫోర్నోగ్రఫీకి మాత్రమే కాకుండా, సాహిత్యపరమైన ఫోర్నోగ్రఫీకి మనం దూరంగా ఉండాలి. నిత్యం సెలబ్రిటీస్, అందమైన మోడల్స్‌ని చూసి వారిని అనుకరించడానికి ప్రయత్నించే క్రమంలో చాలామంది విద్యార్థులు అప్పుల పాలైన వారు ఉన్నారు. సెలబ్రిటీస్‌తో పోల్చుకోవడం ద్వారా తమ జీవితాలను విపరీతమైన ధోరణితో జీవిస్తున్నారు. సంస్కృతి అనేది మనము ఏమి ఆలోచించాలి? మన ఇష్టాయిష్టాలను, తప్పు ఒప్పు అనే భావనను కూడా ప్రభావితంచేస్తుంది.

## సంస్కృతిని ఎలా అర్థం చేసుకోవాలి?

మనము సంస్కృతిలో బయటకు కనపడుతున్నదానిని విమర్శనాత్మకంగా చూడాలి. దాని వెనుక నిజంగా ఏమి జరుగుతుంది అనే దానిని గ్రహించడానికి ప్రయత్నించాలి. "మానవులు ప్రపంచం అనే పుస్తకాన్ని చదివే సామర్థ్యాన్ని పోగుట్టుకొన్నారు కాబట్టి దేవుడు వారికి పరిశుద్ధ లేఖనాలు అనే మరో పుస్తకాన్ని ఇవాల్సిన అవసరం వచ్చింది. అది ప్రపంచంలో రాయబడిన అనేక విషయాల గురించిన ఉపమానాలను కలిగియున్న పుస్తకము" అని సెయింట్ బోనవెంచర్ అన్నాడు. అయితే పరిస్థితులు ఇంకా అధ్వాన్నంగా మారాయి. ఎందుకంటే మనము లేఖనాలను సరిగా చదివే సామర్థ్యాన్ని కూడా కోల్పోయాము. గనుక మన ప్రాధాన్యత బైబిల్ అక్షరాశ్యులం అవ్వడానికి ఇవ్వాలి. ఇది కల్చరల్ అక్షరాశ్యతకి ఉపయోగపడాలి. క్లిష్టమైన ఈ ప్రపంచాన్ని, దానిలో ప్రతిదానిని లేఖనాల వెలుగులో చూడడం నేర్చుకోవాలి, నేర్పించాలి. లేఖనాలకు అనుగుణంగా మన ఊహను పెంపొందించుకోవాలి. మన సంస్కృతిని బైబిల్ పరిభాషలో వివరించడానికి ప్రయత్నించాలి. ఉదాహరణకు రెండు విషయాల్ని చూద్దాం.

ఈ రోజుల్లో ఎక్కువగా కనబడుచున్న పోకడ ఏంటంటే రాత్రికి రాత్రే ఫేమస్ అవ్వాలి, మనుష్యులు మనం చేసే దానిని పొగడాలి, మన గురించి అందరూ గొప్పగా చెప్పుకోవాలనే తాపత్రయం విపరీతంగా కనబడుతుంది. అందుకే వారు చేసే ప్రతి పనిని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ప్రశంశల కోసం ఎదురుచూస్తున్నారు. క్రైస్తవ్యంలోకి కూడా ఈ సంస్కృతి బలంగా చొచ్చుకొచ్చింది. మనము చేసిన ప్రతిదానిని ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్‌లలో స్టేటస్‌లుగా పెట్టుకొని మనుష్యుల ప్రశంశల కోసం పాకులాడడం మనం గమనిస్తున్నాము. ఫేమస్ అవ్వాలనుకోవడం ఖచ్చితంగా పాపము అవుతుంది. యేసుక్రీస్తు ఇలా అన్నాడు "మనుష్యులకు కనబడవలెనని వారి యెదుట మీ నీతి కార్యము చేయకుండా జాగ్రత్తపడుడి; లేనియెడల పరలోకమందున్న మీ తండ్రి యొద్ద మీరు ఫలము పొందరు" (మత్తయి 6:1).

ప్రస్తుత సంస్కృతి ఒక వ్యక్తి యొక్క గుర్తింపుని అతనికున్న ఉద్యోగం, అది కూడా గవర్నమెంట్ ఉద్యోగమా? ఎంత కూడబెట్టాడు? ఏమి సాధించాడు? అతనికున్న నైపుణ్యాలేంటి అనే అంశాలను ప్రామాణికంగా తీసుకొని కొలుస్తుంది. చాలాసార్లు క్రైస్తవులు కూడా అదే మన నిజమైన గుర్తింపు అనుకొని బాధపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగం లేకపోతే నాకు విలువలేదని ఎంతో ఒత్తిడికి లోనవుతున్న విశ్వాసులు కోకొల్లలు. మనము గమనించవలసింది ఏంటంటే క్రైస్తవులుగా మన గుర్తింపు మనము ఏమి చేస్తాము లేదా చేశాము అనే దానిలో లేదుగానీ మనము క్రీస్తులో ఏమైయున్నామనే దానిలోనే ఉంది. ఈ వాస్తవం మనలను ఐడెంటిటీ క్రైసిస్ అనే రోగము నుండి కాపాడుతుంది.

## ముగింపు

మనము ఉన్న సంస్కృతిలో యేసుక్రీస్తులా జీవించడం అనేది మన భాగ్యం, బాధ్యత. మనము దానిని నిద్రలో నడుస్తూ చేయలేము. "సంఘం బైబిల్ సంబంధమైనది. కాబట్టి, ఆత్మ శక్తితో సంఘ సభ్యులు తమ జీవితంలో వాక్య ప్రకారం నడుచుకొంటే అది సజీవ వ్యాఖ్యానంగా మారుతుంది. "సువార్త వాస్తవ సత్యానికి సంఘము సజీవమైన ప్రదర్శనశాలగా ఉనికిలో ఉండాలి" అని కెవిన్ వాన్‌హూజర్ అనే భక్తుడు వ్యాఖ్యానిస్తాడు. మనము ఈ ప్రాపంచిక సంస్కృతిలో ఈదుతున్నప్పుడు ప్రవాహానికి ఎదురెళ్ళే డాల్ఫిన్‌గా ఉండాలే గానీ, ప్రవాహంలో కొట్టుకొనిపోయే జెల్లీ ఫిష్ లాగా ఉండకూడదు. మారుతున్న లోకములో మారని సువార్త సత్యాలకు సమకాలీన సాక్షులుగా ఉండడానికి దేవుని సహాయంతో ఈ నూతన సంవత్సరంలో ప్రయత్నిద్దాం.

**– డా. పి. నాసరయ్య,** వైజాగ్



# కళాశాల ప్రాంగణాలలో సవాళ్ళు

కాలంతో పాటే పరిగెత్తే తరం, నిత్యం మార్పు చెందే పోకడలు, చట్రం వెలుపల ఆలోచించే మెదళ్ళు, ఆకాశమే హద్దుగా విహరించే స్వేచ్ఛా జీవితం, రంగుల ప్రపంచాన్ని అనుభవించాలనే కోరిక, అరచేతిలో సెల్ ప్రపంచం, స్క్రీన్ టైమ్ ఎక్కువ స్టడీ టైమ్ తక్కువ, విజయంలో ఉప్పొంగడమే తప్ప అపజయాన్ని తట్టుకోలేని వారు నేటి కాలేజి విద్యార్థులు. వీరికి యేసుక్రీస్తును పరిచయం చేసి వారిని శిష్యులుగా చేయడానికే మనం ఉన్నాం.

ఈ పరిచర్యలో పాల్గొనే మనం కళాశాలలో విద్యార్థుల పరిస్థితి, కళాశాల ప్రాంగణాల్లో పరిచర్యకు ఉన్న సవాళ్ళు ఏంటి? వాటి పరిష్కారాలు ఎలా? అనే విషయాలు తెలుసుకోవాలి. కళాశాల వాతావరణం, విద్యార్థుల నాడి మనకి అర్థం కాకపోతే పరిచర్యను ప్రభావవంతంగా ముందుకు తీసుకొని పోలేము. అందుకే కళాశాల ప్రాంగణాల్లో ఉండే కొన్ని సవాళ్ళను వాటి పరిష్కారాలను చూద్దాం.

### 1. బిజీ అకడమిక్ షెడ్యూల్

విద్యా సంవత్సరం అందరికి ఒకేలా లేదు. కోర్స్, కాలేజ్, యూనివర్సిటీని బట్టి మారిపోతున్నాయి. ఫలితంగా 64% మంది విద్యార్థులు చదువుల ఒత్తిడిలో ఉన్నారు. ఇలాంటి సమయంలో వారు ఎక్కువగా మనతో ఉండలేరు. కాబట్టి మన కార్యక్రమాలు, బైబిల్ స్టడీస్ తక్కువ సమయంలో అంటే 30 నిమిషాలలో ప్రభావంతంగా ఉండేలా చూసుకోవాలి. వీటికి అనుగుణంగా మన ప్రణాళికల్లో కూడా మార్పు రావాలి.

### 2. సోషల్ మీడియా అడిక్షన్

ఎక్కువమంది విద్యార్థులు ఎక్కువ సమయం సోషల్ మీడియాలో గడుపుతున్నారు. వీటి నుండి బయటకు రాలేకపోతున్నారు. ఎక్కువ సమయం స్క్రీన్‌కి అలవాటు పడటం వల్ల తక్కువ సేపు మాత్రమే వినగలుగుతున్నారు. ఇలాంటి వారు ప్రోగ్రామ్స్, క్యాంప్స్‌లలో ఎక్కువసేపు కూర్చొని వినడం లేదు. కాబట్టి మన బోధనా పద్ధతులను మార్చుకోవాలి. ఇంట్రాక్టివ్‌గా, వర్క్ షాప్ పద్ధతిలో, యాక్టివిటీ ఓరియెంటెడ్‌గా ఉండాలి.

### 3. వక్రీకరించబడిన ఆలోచనలు

సమాజంలో కులం, వివాహం, గర్ల్ ఫ్రెండ్ లేదా బాయ్ ఫ్రెండ్, డబ్బు, ఉద్యోగం, చదువు, లింగ సంబంధ విషయాలు, సహజీవనం, వివాహం ముందు లైంగిక చర్యలు, వివాహేతర సంబంధాలు, ప్రేమ, కట్నం, లంచం, రిక్రియేషన్, అవినీతి విషయాల పట్ల తప్పుడు ఆలోచన కలిగి ఉన్నారు. ఇలాంటి వారికి దైవిక విలువలు బోధించడం సవాలుతో కూడుకొన్నది. సత్యాన్ని ప్రేమతో అనుభవపూర్వకంగా తెలియజేయాలి. దీనికి క్రైస్తవ సమర్థనవాదం, రీజన్, లాజిక్ లాంటి వాటి

విషయాలలో అవగాహన పెంచుకోవాలి. ప్రస్తుతం జరుగుచున్న విషయాల పట్ల అప్డేటెడ్ ఇన్ఫర్మేషన్తో ఉండాలి.

### 4. డ్రగ్స్ అండ్ ఆల్కహాల్ అడిక్షన్

మద్యం, డ్రగ్స్ ఎక్కువగా వినియోగిస్తున్న రాష్ట్రాల్లో మన రాష్ట్రం కూడా ఉంది. డ్రగ్ రహిత ఆంధ్ర ప్రదేశ్ కోసం ప్రభుత్వం పోరాడుతుంది. మనం వీటిపట్ల సరైన అవగాహన కలిగి, బైబిల్ దృక్పథంలో వాటికి జవాబులు అందించాలి. వారు వాటి నుండి విడుదల పొందడానికి ప్రాక్టికల్ సలహాలు ఇచ్చి మన వంతు సహాయం చేయాలి.

### 5. అన్నీ ఉన్నా లేమిని అనుభవిస్తున్న తరం

భౌతికంగా కావలసినవన్నీ వన్క్లిక్తో వచ్చే పరిస్థితుల్లో ఉన్నాయి. అందులోనే జీవిత పరమార్థాన్ని వెతుకుతున్నారు. కానీ అది దొరకక నిరుత్సాహంలో ఉన్నారు. మానసికంగా ఒంటరితనం, కృంగుబాటు, అపరాధ భావన, శూన్యతను అనుభవిస్తున్నారు. అన్నీ ఉండి దేవుడు లేకుండా ఆనందాన్ని వెతికే తరంలో సృష్టికర్త లేకుండా సంపూర్ణానందం లేదనే సత్యాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉంది. దీనికి విద్యార్థుల మానసిక పరిస్థితుల పట్ల అవగాహన పెంచుకోవాలి.



### 6. స్నేహితుల ఒత్తిడి

స్నేహితుల ప్రభావం విద్యార్థులపై ఎంతో ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి విద్యా ర్థులతో స్నేహపూర్వకంగా మెలగడం, ప్రేమ పూర్వకంగా స్పందించడం, హృదయపూర్వకంగా వారిని అంగీకరించడం వల్ల వారిని క్రీస్తు కొరకు గెలుచుకోవచ్చు.

### 7. అప్డేట్ అవ్వడం

ప్రస్తుత విద్యార్థులు వారు వాడే వస్తువులు, టెక్నాలజీ, ఆలోచనా విధానంలో అప్డేటెడ్గా ఉన్నారు. వారు మనకంటే ఎన్నో విషయాల్లో ఎంతో ముందున్నారు అనే విషయాన్ని గ్రహించాలి. వారి ఆలోచనా ధోరణిని గమనించాలి. మనం కూడా పరిస్థితులకు తగ్గట్టు విలువలతో రాజీ పడకుండా అప్డేట్ అవ్వాలి. మూస పద్ధతి ఆలోచనలకు స్వస్తి పలకాలి. మన టాపిక్స్, క్యాంప్ వెన్యూ, బైబిల్ స్టడీస్, బోధనా పద్ధతుల్లో మార్పు రావాలి. మార్చుకోవాలి. అప్పుడే మనం ఈ తరానికి సేవ చేయగలం.

## పరిచర్యలో సవాళ్ళు

### 1. వ్యతిరేకత

క్యాంపస్లో మత సంబంధ విషయాల పట్ల అతిగా స్పందించేవారు ఎక్కువగా ఉన్నారు. వీరు పరిచర్యను వ్యతిరేకిస్తూ లేని వాటిని చెప్పి బెదిరిస్తున్నారు. కాబట్టి మన పరిచర్య చేసే విధానం మార్చుకోవాలి. వ్యక్తిగత సువార్తీకరణ, చిన్న గుంపులు లాంటి ప్రభావంతమైన పద్ధతులను ఎన్నుకోవాలి.

### 2. ఇతర విశ్వాస విద్యార్థులను చేరుకోవడం

మనం ఎక్కువగా క్రైస్తవ నేపథ్యం నుండి వచ్చిన వారినే రీచ్ అవుతున్నాము. కానీ ఇతర విశ్వాసాల విద్యార్థులను కూడా దేవుడు ప్రేమిస్తున్నాడనే విషయం మనం అర్థం చేసుకోవాలి. దీనికి తగినట్లు మనం వారికి ఏ విధంగా సువార్తను అందించాలో అవగాహన కలిగి ఉండాలి.

### 3. ఇతర పరిచర్యలతో సమన్వయం

మనవలె క్యాంపస్లో పరిచర్య చేసే గుంపులు, సంఘాల వలన ఇబ్బందులు ఉన్నాయి. విద్యార్థులు వాక్యం కంటే ఇతర విషయాలకు, తప్పుడు బోధలకు ఆకర్షించబడుతున్నారు. ఇలాంటివి క్యాంపస్లో సమస్యలకు కారణం అవుతున్నాయి. కాబట్టి మనం వీరి పట్ల జాగ్రత్తగా ఉండాలి. ఒకే దర్శనం గల వారితో సమన్వయ పరుచుకుంటూ స్నేహపూర్వకంగా ఉండాలి. మన బైబిల్ స్టడీస్ అర్థవంతంగానూ ఆకర్షణీయంగానూ ఉండేటట్లు ప్రణాళిక వేసుకోవాలి. సంఘాలకు మన పరిచర్య గురించి సరియైన విధంగా పరిచయం చేయాలి. తద్వారా మనం ఇలాంటి సమస్యలను పరిష్కరించుకోగలం.

### 4. చదువు, పరిచర్యను సమన్వయ పరచుకోవడం

చాలామంది ఇయు విద్యార్థులు పరిచర్యను, చదువును బ్యాలెన్స్ చేసుకోవడంలో తడబడుతున్నారు. తద్వారా పరిచర్య సరైన విధంగా చేయలేకపోతున్నారు. కాబట్టి వీరికి సమయపాలనను నేర్పించాలి. రోజూ, వారం టైమ్ టేబుల్ వేసుకోవడం, హాలిడేస్ను ఎలా ఉపయోగించుకోవాలో నేర్పించాలి. విద్యార్థులు చొరవ తీసుకొని పరిచర్య చేయాలంటే చదువుల్లో రాణించాలి.



### 5. విద్యార్థి నాయకులు

ఇది విద్యార్థి పరిచర్య కాబట్టి వారి చొరవను ప్రోత్సహించాలి. గ్రూప్ బైబిల్‌స్టడీ, వ్యక్తిగత సౌవార్తీకరణ, విద్యార్థులను సమీకరించడం, కొత్త కళాశాలలో పరిచర్య ప్రారంభించడం, తోటి విద్యార్థులను స్థిరపరచడం, కమిటీలలో నిర్ణయాలు చేయడం వంటివి వారే చేసేలా ప్రోత్సహించాలి. ప్రభావవంతమైన విద్యార్థి నాయకత్వమే పరిచర్యకు గీటురాయి.

### 6. నిలకడైన ఆత్మీయ ఎదుగుదల

ఇయు విద్యార్థులు నిలకడగా ఆత్మీయంగా ఎదగాలి. స్నేహితుల ఒత్తిడి , క్యాంపస్ వాతావరణం, సోషల్ మీడియా వల్ల దేవునితో గడిపే సమయం లేక ఆత్మీయంగా వెనకబడుచున్నారు. వీరికి ఆత్మీయ విషయాల పట్ల ఆసక్తిని కలిగించాలి. దేవునితో గడిపే క్షణాల యొక్క ప్రాముఖ్యతను తెలియజేయాలి. క్రమం తప్పకుండా ప్రభువుతో సమయం గడిపేలా ప్రోత్సహించాలి.

### 7. క్రొత్తగా అంగీకరించిన వారిని ఫాలోఅప్ చేయడం

ఈ విషయం మనకు ఎంతో సవాలుగా మారింది. ఎంతో మంది విద్యార్థులు సువార్త వింటున్నారు. అందులో కొందరు స్పందిస్తున్నారు. కానీ అతి కొద్ది మంది మాత్రమే స్థిరపడుచున్నారు. ఈ విషయంలో మనం మన పద్ధతులు మార్చుకొని ప్రభావవంతంగా అందుబాటులో ఉన్న పద్ధతులను అనుసరించాలి. దీనికి నిర్దిష్టమైన ప్రణాళిక, ప్రతిష్టాత్మకమైన అమలు అవసరం.

### 8. మెంటరింగ్

విద్యార్థులను సరైన విధంగా మెంటరింగ్ చేయాల్సిన బాధ్యత మనది. సీనియర్, జూనియర్ విద్యార్థులను ప్రణాళికాబద్దంగా, ప్రభావవంతంగా మెంటరింగ్ చేయాలి. దీని కోసం యుఇయస్ఐ-ఏపి ప్రచురించిన యంపిసి పుస్తకాన్ని యంపిసిలలో అనుసరించాలి. విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధను చూపుతూ వారు ఆత్మీయంగా, మానసికంగా, భౌతికంగా, సామాజికంగా అన్ని విషయాలలో సరైన విధంగా ఎదిగేటట్లు వారిని నడిపించాలి.

### 9. యఫ్ఐయస్ అంతర్జాతీయ విద్యార్థుల పరిచర్య



వివిధ దేశాల నుండి వచ్చిన వేల మంది విద్యార్థులు వివిధ రకాలైన యూనివర్సిటీల్లోనూ, కళాశాలలోనూ చదువుతున్నారు. వీరికి సువార్త అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. వీరు తమ తమ దేశాలకు వెళ్ళిన తర్వాత ఎంతో ప్రభావవంతమైన నాయకులవుతారు. వీరి ద్వారా వారి దేశాల్లో ఉన్న విద్యార్థులను మనము సువార్తతో చేరుకోవచ్చు. ఇక్కడ చదివే అంతర్జాతీయ విద్యార్థులలో కొంతమంది దేశాలలో సువార్త చెప్పడానికి అనుమతి లేదు. కాబట్టి వారికి ఇక్కడే మనం సువార్త అందించాలి.

### 10. అర్బన్ విద్యార్థుల మధ్య పరిచర్య

ఈ పరిచర్య అవసరత చాలా ఉంది. అర్బన్‌లో పుట్టి అదే సంస్కృతిలో పెరిగిన విద్యార్థులకు వారి కి అనుగుణమైన పద్ధతిలో సువార్త అందించవలసిన బాధ్యత ఎంతో ఉంది. ఇది చాలా ప్రాముఖ్యమైనది. త్వరితగతిన చేయాల్సి ఉంది. దీని కొరకు గ్రాడ్యుయేట్స్ కుటుంబాలు, అర్బన్ విద్యార్థులు ఎక్కువ చొరవ తీసుకోవాలి.

### ముగింపు

కాబట్టి ఇలాంటి ఎన్నో సవాళ్ళను మనము ఎదుర్కొని పరిచర్య చేయాలి. ఈ పరిస్థితుల్లో మనకు వ్యక్తిగత సువార్తీకరణ, సెల్ గ్రూప్స్ పరిచర్య, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో పరిచర్య, సోషల్ మీడియాలో పరిచర్య చేయడం వంటి పద్ధతులను ప్రభావవంతంగా వినియోగించుకోవాలి. కానీ వీటన్నిటి కంటే విద్యార్థి చొరవ చాలా ప్రాముఖ్యమైనది. దేవుని యొక్క పద్ధతి మానవులే. అంటే విద్యార్థులే విద్యార్థులను రక్షణలోకి నడిపించే విధంగా తయారు చేయాల్సిన బాధ్యత మనదే.

– ఆర్. రాజ్‌కుమార్, స్టాఫ్, తిరుపతి



# ప్రెషర్ కుక్కర్ జీవితాలు

*"హే సుజిత్! ఎందుకు కోపంగా ఉన్నావ్?"*
*అని కళాశాలలో సుజిత్‌ను కలిసిన అంకిత్ ప్రశ్నించాడు.*

*"నవ్వడానికి ఏముంది బ్రదర్, నా బ్రతుకంతా చదువు, చదువు, చదువు, పరీక్షలు, పరీక్షలు, పరీక్షలు" అన్నట్లుంది అని తన నుదుటిని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ సుజిత్ బదులిచ్చాడు. అది కళాశాల విరామ సమయం. కళాశాల క్యాంటిన్ వైపుకు వారు నడుస్తున్నారు.*

*"మన కళాశాలలోని సూపర్‌వైజర్స్, జూనియర్ లెక్చరర్స్ మన మీద ఇలా అరుస్తూ ఉంటారు 'గత పరీక్షకన్నా ఈ పరీక్షలో నీకు అరమార్కు ఎందుకు తగ్గింది?'. నీకు తెలుసుగా, మనలో కొంతమందిని వారు కొడుతుంటారు కూడా. ఇంటి దగ్గరేమో మమ్మీ, డాడీ కళాశాలనుండి మన మార్కుల వివరాలతో కూడిన యస్‌యంయస్‌పైనే వారు దృష్టి ఉంచుతారు. మనకు విరామ సమయం ఎప్పుడుంటుందో! అసలు ఉంటుందా? కనీసం నవ్వడానికైనా.... అని నాకు ఆందోళనగా ఉంది. నేను ఎంతో ఒత్తిడిలో ఉన్నాను. నేను ప్రెషర్ కుక్కర్‌లో ఉన్నానా ఏంటి? అని నాకు అనిపిస్తుంది " అని సుజిత్ చెప్పాడు.*

*"నువ్వన్నది నిజమే. నాకు కూడా చాలా విసుగొస్తుంది సుజిత్. మనల్ని అర్థం చేసుకునే వాళ్ళు అసలు ఈ భూమి మీద ఉన్నారా? అని నాకనిపిస్తుంది"*
*అని క్యాంటిన్‌లో కూల్‌డ్రింక్ తాగుతూ అంకిత్ చెప్పాడు.*

• • • • •

ఈ రోజుల్లో విద్యార్థులు ప్రెషర్ కుక్కర్ జీవితాలను జీవిస్తున్నారు. ఎంతో శారీరక శ్రమను, మానసిక ఒత్తిడిని వారు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాలను వారు తమ తల్లిదండ్రులతో కూడా చెప్పుకోలేకపోతున్నారు. వాళ్ళ అబ్బాయి లాగా, వీళ్ళ అమ్మాయిలాగా మా పిల్లలు చదవడం లేదంటూ తల్లిదండ్రులు కూడా వారిపై ఇంకా ఒత్తిడిని పెంచుతున్నారు. "రాజా బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుంటున్నాడు, అతనిలాగా నీవెందుకు చదవలేవు?" అని వారు ప్రశ్నిస్తుంటారు. తమ తల్లిదండ్రులకు సమాధానం చెప్పడం కూడా వారికి సమస్యగా మారుతుంది. సమాధానం చెబితే, వీళ్ళు మాపై తిరగబడుతున్నారని వారు భావిస్తారు. తిరుగుబాటుదారులు అని ముద్ర వేస్తారు. వారు ఎక్కడికి వెళ్ళాలి? వారిని అర్థం చేసుకునే వారు ఎవరు?

### ఒత్తిళ్ళు రకాలు: మితమైన ఒత్తిడి, అమితమైన ఒత్తిడి

ఈ రోజుల్లో ఒత్తిడి అనేది సర్వసాధారణం, అనివార్యం. మనం ప్రతి ఒక్కరం ఆయా పనుల్లో కొంత ఒత్తిడిని ఎదుర్కొంటుంటాము. కొంతమేరకు ఈ ఒత్తిడి మనకు అవసరమే. కోర్స్ చివర్లో పరీక్షలు ఉండటం మంచిదే. ఫలితంగా విద్యార్థులు తమ పుస్తకాలను తెరచి చదువుతారు. ఈ రకమైన ఒత్తిడిని మితమైన లేదా మంచి ఒత్తిడి (Eu-stress) అంటారు. నిజానికి ఈ రకమైన ఒత్తిడి మనకు ప్రేరణగా ఉంటుంది. ఒక రచయితకు గడువు ఇవ్వడం, ఒక విద్యార్థికి పరీక్షలు, ఒక ఉపాధ్యాయునికి ఒక పర్యవేక్షకుడు వంటివి లేకపోతే జీవితం నిస్సారంగా ఉంటుంది.

కానీ కొన్ని సార్లు ఈ ఒత్తిడి భరించలేనంత ఎక్కువగా ఉంటుంది. అలాంటి సందర్భాల్లో అది బాధను కలిగిస్తుంది. ఒక వ్యక్తికి దాన్ని భరించే శక్తి లేదా సహనం లేనప్పుడు ఇలా జరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఒత్తిడి మోతాదు కొంచెం ఎక్కువైనా అది ఆ వ్యక్తిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. ఆ ఒత్తిడిని భరించే శక్తి ఒక వ్యక్తికి ఉంటే, అతడు/ఆమె దాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతారు. ఇదంతా ఆయా వ్యక్తుల మీద ఆధారపడి ఉంటుంది. అయితే, ఒత్తిడి పెరుగుతూపోతే, ఎంతటి వ్యక్తి అయినా కృంగి పోతాడు.

### ఈ రోజుల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిడి:

ఈ రోజుల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిళ్ళు ఏంటి? విద్యాసంబంధమైన, వ్యక్తిగతమైన తల్లిదండ్రులను, స్నేహితులను వదులుకోవడం, కొత్త స్నేహితులను ఏర్పరచుకోవడం, సంఘం/సేవకుని ద్వారా వచ్చే ఒత్తిళ్ళు, అలాగే ప్రమాదకరమైన 'సంబంధాల' ఒత్తిళ్ళు వారు ఎదుర్కొంటున్నారు. వాటిని మనం క్లుప్తంగా చూద్దాం.

**విద్యాసంబంధమైన ఒత్తిడి:** విద్యార్థులపై ఎన్నో అంచనాలు ఉంటున్నాయి. ఉపాధ్యాయులు తమ విద్యార్థులపైన, తల్లిదండ్రులు తమ పిల్లలపైన మితిమీరిన అంచనాలు పెట్టుకొంటున్నారు. పేరు ప్రఖ్యాతులు ఉన్న విద్యాసంస్థల్లో ఉండే కొద్దిపాటి సీట్లకోసం తమ విద్యార్థులను సిద్ధం చేసే విద్యా సంస్థలు పెరిగిపోతున్నాయి. ఈ సంస్థల మూలంగా విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. ఇంటర్‌లో విద్యార్థులు పోటీ పరీక్షల కోసం సిద్ధపడే క్రమంలో ఎదుర్కొనేంత ఒత్తిడిని ఆరు లేదు అంతకన్నా క్రింది తరగతి విద్యార్థులు ఎదుర్కొంటున్నారు.

**పాత స్నేహితులను వదలడం, కొత్త స్నేహితులను ఏర్పరచుకొనే క్రమంలో ఎదురయ్యే ఒత్తిడి:**

పాఠశాలలోని పాత స్నేహితులను వదలడం, కొత్తగా చేరిన విద్యా సంస్థలో స్నేహితులను ఏర్పరచుకోవడం కొన్ని సార్లు విద్యార్థులపై ఒత్తిడిని పెంచుతుంది. ఎలాంటి వారితో స్నేహం చేయాలి, వారు నమ్మదగిన వారేనా, వారు నిజాయితీ పరులేనా అనే విషయాలను విద్యార్థులు ఇతరులతో స్నేహసంబంధాలను ఏర్పరచుకునే ముందు ఆలోచించాలి. తమ వ్యక్తిత్వాన్ని మలచే అంశాలలో స్నేహితులు చాలా ప్రాముఖ్యమైనవారు.



**తల్లిదండ్రుల ఒత్తిడి:** తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో అంచనాలను పెట్టుకొంటారు. కొంతమంది తల్లిదండ్రులు తాము సాధించలేకపోయిన వాటిని తమ పిల్లల ద్వారా సాధించాలని కలలు కంటుంటారు. తాము సాధించలేకపోయిన ఉద్యోగాన్ని తమ పిల్లలు సాధించాలని ఆశిస్తుంటారు. తమ ఆకాంక్షలను పిల్లలు పైకి అంగీకరించినా, వాటిని సాధించాలనే ప్రేరణ, ఆసక్తి, వారికి లేదు అన్న విషయాన్ని వారు గుర్తించలేరు. పిల్లలను తరచూ ఇతర పిల్లలతో పోల్చడం వారికి తీవ్ర కోపాన్ని కలిగిస్తుంది, వారిపై ఎంతో ఒత్తిడిని పెంచుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఒకరితో మరొకర్ని పోల్చడం, లేదా వారిని తమ బంధువుల, స్నేహితుల పిల్లలతో పోల్చడం చేస్తుంటారు.

**స్నేహితుల ఒత్తిడి:** టీనేజ్, ఇరవైల్లో ఉన్న వారు స్నేహితులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. స్నేహితులు మరియు తమ అభిమాన ఆటగాళ్ళు, లేదా నటులు, సంగీత విద్వాంసులు వంటి వారికి వారు ఎంతో

ప్రాధాన్యత ఇస్తారు. వారి దుస్తులను, ఆహార్యాన్ని అనుకరిస్తుంటారు. తన జీవనశైలి తమ తల్లిదండ్రుల జీవనశైలికి భిన్నంగా ఉండడం వారిని ఒత్తిడికి గురి చేస్తుంది. స్నేహితులను అనుకరించాలా లేదా తమ తల్లిదండ్రులను అనుకరించాలా అనే గందరగోళంలో వారు ఉంటారు. అనేకమంది విద్యార్థులకు ఇది గొప్ప సంక్లిష్ట పరిస్థితి.

**సంఘం/పాస్టర్/సంఘ పెద్దల ఒత్తిడి:** కొంతమంది పాస్టర్లు, సంఘపెద్దలు ఇతరులను పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకుంటారు. పిల్లలకు పేర్లు పెట్టడం, పెళ్ళిసంబంధాలు చూడడం, ఉద్యోగాలను సూచించడం వంటివి కూడా కొన్నిసార్లు పాస్టర్లే చేస్తుంటారు. ఇది అన్ని సంఘాల్లో కాదుగాని కొన్ని సంఘాల్లో జరుగుతూ ఉంటుంది.

**సంబంధాల ఒత్తిళ్ళు:** అనేకమంది యువకులు ఒకరితో ఒకరు 'సంబంధాలలో' పడిపోతున్నారు. వాటికి స్నేహం అని పేరు పెడుతున్నారు. ఇలాంటి సంఘటనలు ఈ రోజుల్లో హైస్కూల్ స్థాయిలో కూడా జరుగుచున్నాయి. ఒకరి పట్ల మరొకరికి వ్యామోహం ఎక్కువవుతుంది. ఆ వ్యామోహం ప్రత్యేక సంబంధాలకు దారి తీస్తుంది. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియనివ్వరు. ఏదైనా జరగకూడనిది జరిగితే, దానిని ఎవరికి చెప్పాలి? "మేము సంబంధాలను ఏర్పరచుకోకపోతే, మా స్నేహితులు మమ్మల్ని ఎగతాళి చేస్తారు, ఒకవేళ అలా చేస్తే మా తల్లిదండ్రులు బాధపడతారు. ఈ రెండింటి మధ్య మేము నలిగిపోతున్నాము". చాలా మంది యువతీ, యువకుల ఆక్రందన ఇది. ప్రమాదకరమైన ఈ పోకడ వారిని గొప్ప ఒత్తిడికి దారితీస్తుంది.

## ఒత్తిడిని తగ్గించే మూడు విషయాలు:

ఒత్తిడులన్నిటినీ ఈ యువకులు ఎలా ఎదుర్కొంటారు? ఎలా భరించగలుగుతారు. ఈ ఒత్తిడులను తగ్గించే మూడు విషయాలు ఉన్నాయి.

1. **దేవుని యందు విశ్వాసం:** విద్యార్థులు యేసుక్రీస్తునందు విశ్వాసముంచి మారుమనస్సు అనుభవాన్ని పొందాలి. ఆయనతో ప్రతి దినము వారు సహవాసం చేస్తుండాలి. వారు ప్రతిరోజు బైబిల్ చదివి, ప్రార్థన చేసుకోవాలి. ఏదో చేయాలి కాబట్టి చేయడం కాకుండా దేవునితో నిజమైన సహవాసాన్ని కలిగి ఉండాలి. దేవునితో జరిగే ఈ పరస్పర సంభాషణ, సహవాసం ద్వారా తాము ఎదుర్కొనే ఒత్తిళ్ళన్నిటిని భరించడానికి శక్తినిస్తుంది.
2. **బలమైన సహవాసం:** ఒకరికొకరు ప్రార్థించుకొంటూ, ప్రభువులో ఎదుగుతూ ఉండే విశ్వాస విద్యార్థి స్నేహితులు వారికి ఉండాలి. వారు తమ అనుభవాలు, విజయాలు, అపజయాలు ఒకరితో ఒకరు పంచుకోవడం ద్వారా ఒత్తిడి వారికి దూరమౌతుంది. కాబట్టి వారికి ఒక బలమైన క్రైస్తవ సహవాస సమూహం అవసరం.
3. **అర్థం చేసుకునే తల్లిదండ్రులు:** ఈ వయస్సులోని పిల్లలకు తల్లిదండ్రులు స్నేహితుల్లా ఉండాలి. వారు తమ పిల్లల్ని అర్థం చేసుకోవాలి. వారు ఏ రంగాలలో రాణించగలుగుతారో అంచనా వేయగలగాలి.

## తల్లిదండ్రులకు 10 ఆజ్ఞలు:



ఒత్తిడులను ఎదుర్కొనే పిల్లల తల్లిదండ్రులు ఈ క్రింద తెలిపిన పది ఆజ్ఞలను ఖచ్చితంగా పాటించాలి.

1. **మీ పిల్లల కోసం ప్రార్థించండి:** తమ పిల్లలు ఒక్కొక్కరికోసం ప్రతి సందర్భంలో తల్లిదండ్రులు ప్రార్థనలు చేయాలి. వారు ఒత్తిడికి లోనయ్యే పరిస్థితులు వచ్చినప్పుడు తల్లిదండ్రులు వారికోసం మరి ఎక్కువగా ప్రార్థించాలి. ప్రార్థన పరిస్థితులను మారుస్తుంది. పిల్లలకు గొప్ప సహాయకరంగా ఉంటుంది.
2. **మీ పిల్లలతో మాట్లాడాలి, వారిని సరి చేయాలి:** తల్లిదండ్రుల ప్రేమతోకూడిన సంభాషణ ప్రతి యువకునికి/యువతికి ప్రతిరోజు అవసరం. వారితో ఎల్లప్పుడు ప్రేమగా మాట్లాడండి, ప్రేమతో సరిచేయండి.
3. **మీ పిల్లలు చెప్పే విషయాలు వినండి:** తమ పిల్లలతో ఎంత సమయం మాట్లాడుతారో, దానికన్నా రెండింతల సమయం వారు చెప్పే విషయాలు వినడానికి కేటాయించాలి. వినండి, వినండి, వారు చెప్పే మాటలను వినండి. సంభాషణ మధ్యలో వారి మౌనాన్ని కూడా వినండి. వారి సంజ్ఞలను, హావభావాలను, వారి ముఖకవళికలను కూడా వినండి.
4. **మీ పిల్లల్ని అర్థం చేసుకొండి:** కొన్ని దశాబ్దాల

క్రితం మీరు కూడా పిల్లలే. మీ పిల్లల స్థాయికి మీరు దిగి వారిని అర్థం చేసుకోండి.

5. **అవసరమైనప్పుడు కౌన్సిలింగ్ తీసుకొండి:** పిల్లల గురించి అవసరమైన కౌన్సిలింగ్‌ను అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులనుండి లేదా పాస్టర్స్ నుండి లేదా కౌన్సిలర్స్ నుండి తల్లిదండ్రులు తీసుకోవడం మంచిది. మీ పిల్లలతో కలిసి వారి దగ్గరకు వెళ్ళడం తప్పేమి కాదు. అది ఎంతో సహాయపడుతుంది కూడా.

6. **తమ ప్రభువైన దేవుణ్ణి మీ పిల్లలు ఆరాధించునట్లు వారిని నడిపించాలి:** మీ పిల్లలు ప్రభువును ఆరాధించునట్లు చూడాలి. వారికి అలాంటి పరిస్థితులు కల్పించాలి. అనేక కార్పోరేట్ కళాశాలలు ఆదివారం నాడు పరీక్షలు నిర్వహిస్తాయి. చర్చ్‌కి వెళ్ళే అవకాశాన్ని వారు ఇవ్వరు. అలాంటి కళాశాలల్లో మీ పిల్లలు చదవడం అంత అవసరమా? ప్రత్యామ్నాయాలకోసం వెదకండి.

7. **మీ పిల్లల్ని సహవాస సమావేశాలకు పంపండి:** తమ వయస్సులో ఉన్న విశ్వాస విద్యార్థులతో మీ పిల్లలు కలవడం, వారితో సహవాసం చేయడం చాలా అవసరం. శ్రద్ధ చూపించే అలాంటి విశ్వాస స్నేహితుల సహవాసంలో వారు భాగస్వాములయ్యేటట్లు చూడండి.

8. **మీ పిల్లల పట్ల దైవికమైన దృక్పథాన్ని అలవర్చుకొండి:** మీ పిల్లలకు ఏది ముఖ్యం? ఆయా పరీక్షల్లో అర్హతపొంది, ఆయా కళాశాలల్లో స్థానం సంపాదించడమా? లేక వారి పేర్లు జీవగ్రంథంలో వ్రాయబడి ఉండడమా? ఆధ్యాత్మిక విషయాలకు ప్రాముఖ్యత ఇవ్వాలి.

9. **మీ పిల్లలు ఎలక్ట్రానిక్ వస్తువులు ఎక్కువగా వాడకుండా జాగ్రత్తపడండి:** వారి పూర్తి అంగీకారంతో ఇది జరగాలి. ఎలక్ట్రానిక్ యంత్రాలను ఎక్కువగా వాడితే వచ్చే దుష్పరిణామాలను చిన్న వయస్సునుండే వారికి వివరించాలి. అలా చేస్తే, వ్యసనాలకు వారు బానిసలవ్వరు. వారి చిన్న వయస్సులోనే మీరు జాగ్రత్తపడండి.

10. **జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో వారికి నేర్పించండి:** మంచి స్నేహబంధాలను ఎలా ఏర్పరచుకోవాలి? విభిన్న వర్గాలు, విశ్వాసాలు ఉన్న ప్రజలతో ఎలా మెలగాలి అనే విషయాలు నేర్పించాలి.



క్యాంటిన్‌లో కూల్‌డ్రింక్ త్రాగడం పూర్తయిన తర్వాత అంకిత్, సుజిత్ చేయిపట్టుకుని ఇలా అన్నాడు: ప్రియమైన సుజిత్, వారాంతములో జరిగే మా యూత్ మీటింగ్‌కు నీవు ఎందుకు రాకూడదు? నీవు క్రొత్త స్నేహితులను అక్కడ కలుసుకోవచ్చు. మనందరి పరిస్థితి ఒకేలా ఉన్నది. కాబట్టి మన కష్టాలను ఒకరితో ఒకరం పంచుకొందాం. మేము గంట లేదా రెండు గంటల సమయం అక్కడ గడుపుతాం. ఆ సమయం నాకు ఎంతో సహాయకరంగా ఉంటుంది. నీవు కూడా రా బ్రదర్.

“నిజంగానా! ఆ మీటింగ్‌కు హాజరవ్వడానికి నేను ప్రయత్నిస్తాను అంకిత్. ఈ వారాంతంలో మనం కలిసి అక్కడికి వెళ్దాం”.

వారాంతాల్లో ఆ ఇద్దరు స్నేహితులు యూత్ మీటింగ్‌కు హాజరవుతున్నారు. అక్కడ ఒకరి సమస్యలు ఒకరు పంచుకోవడం, ఒకరిపట్ల ఒకరు శ్రద్ధ చూపించడం వీరిద్దరికి ఎంతో సహాయకరంగా ఉంది. బైబిల్ ఆధారంగా ఆ యూత్ మీటింగ్ నాయకుడు చెప్పే విషయాలు తాను ఎదుర్కొంటున్న ఒత్తిళ్ళను తట్టుకోవడానికి సుజిత్‌కు సహాయపడ్డాయి. తమ ప్రెషర్ కుక్కర్ జీవితాలనుండి కొంతసేపు బయటపడ్డామనే భావన వారికి కలిగింది. ప్రేమగల మన ప్రభువైన దేవునికే స్తుతి, మహిమ, ఘనత చెల్లునుగాక!

**– డా. యం. అంతోని దేవిడ్,** హైదరాబాద్



థియాలజీ

# పవిత్రీకరణ

దేవుని స్వారూప్యములోనికి మారే నిరంతర ప్రక్రియ

## నిర్వచనం

పాపిని ఈ పాపపు లౌకిక ప్రపంచం నుండి రక్షించిన తర్వాత పవిత్ర ఉద్దేశాల కొరకు ప్రత్యేకపరిచే ప్రక్రియను పవిత్రపరచబడడం అంటారు.

పవిత్రీకరణ నూతన జన్మ అనుభవం దగ్గర ప్రారంభమై, జీవితాంతం కొనసాగి మరణం దగ్గర ముగుస్తుంది. పవిత్రీకరణ విమోచనము యొక్క అన్వయమై జీవితాంతం కొనసాగే ప్రక్రియ. పవిత్రీకరణ మనలను పాపపు శక్తి నుండి విడిపించి దేవుని స్వారూప్యములోనికి మార్చే నిరంతర ప్రక్రియ.

## పాతనిబంధన, కొత్తనిబంధన

పాతనిబంధనలో దేవుడు ఇశ్రాయేలీయులను దేవుని కోసం ప్రతిష్టించుకోమని చెప్పాడు (లేవీ 11:44). అంతేగాకుండా నేను మిమ్ములను పరి శుద్ధపరచు యెహోవాను అని సెలవిచ్చాడు (లేవీ 22:33). పాత నిబంధనలో ఆహారం దగ్గర మొదలై కొత్త నిబంధనలో ప్రవర్తన అంతటిలో పరి శుద్ధంగా ఉండాలని (1 పేతురు1:16), సంబంధాల విషయంలో పరిశుద్ధంగా ఉండాలని (1 థెస్స 4:3) మనలను హెచ్చరించాడు. యజమానుడు వాడుకొనుటకు అర్హమైన పాత్రగా ఉండాలంటే ఏమి చేయాలో అది కూడా సెలవిచ్చాడు.

## వివిధ సిద్ధాంతాల మధ్య తేడా

తిరిగి జన్మించడం (Regeneration) నా స్వభావంలో మార్పు అయితే, నీతిమంతునిగా తీర్చబడడం (Justification) నేను క్రీస్తు యెదుట నిలు వబడే న్యాయపరమైన తీరు. దత్తత (Adoption) నా హోదాలో మార్పు. పవిత్రీకరణ (Sanctification) నా శీలం, వ్యక్తిత్వం, ప్రవర్తనలో మార్పు. పవిత్రీకరణ మన అంతరంగస్థితిని గూర్చి మాట్లాడుతుంది. మన సహకారంతో దేవుడు మనలో జరిగించే నిరంతర ప్రక్రియ.

## వాక్యాధారం

### నూతన నిబంధనలో

తీతు 3:5లో పరిశుద్ధాత్మ మనకు పునర్జన్మ సంబంధమైన స్నానము (Sanctification - Washing & Regeneration) వలన మనకు (నూతన జన్మ అనుభవము) నూతన స్వభావము కలుగ చేయడం ద్వారా రక్షించెను అని రాయబడింది.

మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున మన దేవుని ఆత్మయందు కడుగబడి, పరిశుద్ధపరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడితిరి (1 కొరింథీ 6:11).

అపొ.కా. 20:32లో పరిశుద్ధపరచబడినవారు అని పౌలు ప్రస్తావించాడు.

దేవుని భయము చేత పరిశుద్ధతను సంపూర్తి చేసుకొందాము (2 కొరింథీ 7:1). సమాధానకర్తయైన దేవుడే మిమ్ములను సంపూర్ణంగా పరిశుద్ధపరచును గాక (1 థెస్స 5:23) అనే వచనాలు ఈ లోకములో మనము పాపరహిత పరిశుద్ధత పొందలేమనే విషయం స్పష్టం చేస్తుంది. మరణం దగ్గర మాత్రమే మనం పాపరహిత పరిశుద్ధతను పొందుతాము.

### పాతనిబంధనలో

పాపము చేయనివాడు ఒకడును లేడు (1 రాజు 8:46). నా హృదయము శుద్ధపరచుకొని యున్నాను. పాపము పోగొట్టుకొని పవిత్రుడనైతిని అనుకొనదగినవాడెవడు (సామె 20:9). పాపము చేయక మేలు చేయు నీతిమంతుడు ఒక్కడూ లేడు (ప్రసంగి 7:20) అనే వచనాలు నిబంధన జనాంగమై పరిశుద్ధంగా జీవించడానికి పిలువబడిన ఇశ్రాయేలీయుల కోసం రాయబడ్డాయి.

1. ఏడవ దినం ప్రత్యేకించబడింది (పరిశుద్ధ పరచబడింది) - ఆది 2:3
2. ఇల్లుగానీ, పొలంగానీ ప్రత్యేకించబడినాయి - లేవీ 25:10
3. లేవీయులు ప్రత్యేకించబడినవారు - సంఖ్యా 8:14
4. ఇశ్రాయేలీయులు ప్రతిష్ఠిత జనము

### పవిత్రీకరణలో ఏమి జరుగుతుంది?

పవిత్రీకరణలో పాపపు శక్తి నుండి మనము విడుదల పొంది క్రీస్తు స్వారూప్యములోకి మార్చబడతాము. 1 యోహాను 3:9లో దేవుని మూలంగా పుట్టినవాడు పాపము చేయడు, పాపము చేయజాలడు అని యోహాను సెలవిచ్చాడు. అందుకు కారణం ఆయన బీజం విశ్వాసిలో నిలుస్తుంది. 1 యోహాను 5:17లో దేవుని మూలంగా పుట్టినవాడు పాపము చేయడు. దేవుని మూలంగా పుట్టినవాడు తన్ను తాను భద్రము చేసికొనును గనుక దుష్టుడు వానిని ముట్టడు అని వాక్యం సెలవిస్తుంది. ఇంగ్లీష్ వెర్షన్‌లో చూస్తే అతడు ఎన్నడూ పాపము చేయడని కాదు గానీ పాపములో కొనసాగడు అని తర్జుమా చేయబడింది. 1 యోహాను 5:4లో దేవుని మూలంగా పుట్టినవారు లోకాన్ని శరీరాశ, నేత్రాశ, జీవపు డంబాన్ని జయిస్తారు. లోకాన్ని జయించేది మన విశ్వాసమే అని రాయబడింది. 1 యోహాను 2వ అధ్యాయంలో యవనస్తులు వాక్యంలో నిలిస్తే దుష్టుని జయిస్తారు అని చెప్పబడింది. మనలో ఉన్న పరిశుద్ధాత్ముడు లోకంలో ఉన్న సాతాను కంటే గొప్పవాడు గనుక మనము సాతానుని జయిస్తాం అని యోహాను రాశాడు. రోమా 6:14లో పాపం మనమీద ప్రభుత్వం చేయదు అని పౌలు రాశాడు. ఎందుకంటే మనం కృపకు లోబడ్డాం. కృపద్వారానే రక్షణ కలిగింది.



పైన చెప్పిన విధంగా మనము శరీరాన్ని, పాపాన్ని, సాతానును జయించడమే కాకుండా మనము పరిశుద్ధాత్మ ద్వారా దేవుని పోలికగానే మార్చబడుచున్నాము అని పౌలు 2 కొరింథీ 3:18లో సెలవిచ్చాడు.

### సంపూర్ణత

పవిత్రీకరణ మన జీవితకాలమంతా కొనసాగే ప్రక్రియ. ఈ లోకంలో ఉన్నప్పుడు మనము పాపరహిత పరిపూర్ణతను పొందలేము. మత్తయి 5:48లో మీ పరలోక తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులై ఉండాలనేది దేవుని పరిపూర్ణ నైతిక ప్రమాణం. పాప స్వభావం వల్ల మనలో ఉండే పాపనైజాన్ని దేవుని కృప, క్షమ ద్వారా మాత్రమే అధిగమించగలం.

ఒక విశ్వాసి క్రియల ద్వారా పాపం చేయకపోవచ్చు. గానీ తన అంతరంగ వైఖరుల ద్వారా పాపం చేసే అవకాశం ఉంది. తన ఉద్దేశాలు పవిత్రం కాకపోవచ్చు, తన ఊహలు, ఆశలు పవిత్రం కాకపోవచ్చు. గర్వం, స్వార్థం, దేవుని పూర్ణంగా నమ్మకపోవడం, ఇతరులను క్షమించక పోవడం లాంటి పాపాలు చేసే ఆస్కారం ఉంది.

యెషయా (6:5) దేవుని చూచినప్పుడు నేను అపవిత్రుడను, అపవిత్రమైన పెదవులు గలవాడను, అపవిత్రమైన పెదవులు గల వ్యక్తుల మధ్య నివసిస్తున్నానని ఒప్పుకొన్నాడు. యధార్థవంతుడు, చెడుతనాన్ని విసర్జించి, దేవుని యందు భయభక్తులు కలిగిన యోబు దేవుని చూచినప్పుడు తన స్వనీతిని బట్టి పశ్చాత్తాపపడినాడు (యోబు 42:5).

విశ్వాసి పాపము చేయడు, పాపం చేయడం అసాధ్యం అని బైబిల్ చెప్పడం లేదు గానీ పాపం తన మీద ప్రభుత్వం చేయదని, శిష్యులకు నేర్పిన ప్రార్థనలో మేము ఇతరుల పాపములు క్షమించిన ప్రకారం మా పాపములను క్షమించుము (మత్తయి 6:12) అని నేర్పించాడు. యాకోబు విశ్వాసులకు రాస్తూ మనమందరం అనేక విషయాలలో తప్పిపోతున్నాము (యాకోబు 3:2), క్రైస్తవ నాయకులు మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను ఇతర విశ్వాసులకు మాదిరిగా

ఉండాలని పౌలు తిమోతిని హెచ్చరించాడు (1 తిమోతి 4:12).

ఈ లోకములో సంపూర్ణంగా మనం పవిత్ర పరచబడలేము అనే విషయం, మనం పరిశుద్ధంగా జీవించడానికి, పరిశుద్ధత కోసం పోరాడడానికి మనల ను నిరుత్సాహ పరచకూడదు. మనం వెనుకాడినా, నిరుత్సాహపడినా మనం పవిత్రంగా జీవించాలనే దేవుని ఆజ్ఞకు అనేకమైన ఇతర ఆజ్ఞలకు వ్యతిరేకంగా జీవిస్తాం. అది దేవుని ఆశ కాదని అర్థం చేసుకోవాలి. మనం వెనుకాడినా, నిరుత్సాహపడినా పరిశుద్ధత విషయమైన పురోగతిలో మనం వెనుకబడిపోతాం.

హైపర్ గ్రేస్ అనే నూతన సిద్ధాంతం దేవుడు మనం ఎలా జీవించినా క్షమిస్తాడు అని చెబుతుంది. కానీ ఇది ఆయన కృపను మనకు దూరం చేయడు అనేది తప్పుడు భావన. దేవుడు దేవదూతలు పాపం చేసినప్పుడు విడిచిపెట్టలేదు. అబద్ధ బోధకుల ను ఆయన విడిచిపెట్టడు. ప్రకటన గ్రంథంలోని సంఘాలకు మారుమనస్సు పొందమనే హెచ్చరిక మనం పాపాన్ని విడిచిపెట్టాలని లేకపోతే దేవుని శిక్ష లేక శిక్షణ తప్పదని హెచ్చరిస్తుంది. కృపను కామాతురతకు ఉపయోగించకూడదని సెలవిస్తుంది.

తుయతైర అనే సంఘంలో ఉన్న యెజెబెలు అనే స్త్రీ దేవుని దాసులకు విగ్రహాలు అర్పించిన వాటిని తినుటకు, జారత్వం చేయడానికి ప్రోత్సహిస్తుందని అది మారుమనస్సు పొందాలని లేకపోతే దానిని మంచం పట్టించి దాని పిల్లలను చంపుతానని దేవుడు చెబుతున్నాడు. కృపను కామాతురతకు ఉపయోగిస్తే దేవుడు ఈ లోకంలోనే మనలను శిక్షిస్తాడు అనే విషయం స్పష్టం అవుతుంది, రక్షణ పొందిన తర్వాత కూడా దేవుని చిత్తం చేయడానికి రూపాంతరం చెందాలని వాక్యం చెబుతుంది.సులువుగా చిక్కులు పెట్టే పాపం విడిచిపెట్టాలని, అయితే చిట్టచివరగా తన మహిమ ఎదుట దేవుడు మనలను నిర్దోషిగా నిలబెడతాడు అని దేవుని వాక్యం చెబుతుంది.

### ఎందుకు మనం పవిత్రంగా జీవించాలి?

1. పవిత్రంగా జీవించాలనేది దేవుని ఆజ్ఞ – లేవీ 11:44
2. పవిత్రత దేవుని చిత్తం – 1 థెస్స 4:3
3. పవిత్రత దేవుని పిలుపు – 1 థెస్స 4:47
4. దేవుని చూడడానికి – మత్తయి 5:8
5. దేవునిచేత వాడబడడానికి – 2 తిమోతి 2:20,21
6. దేవుని మహిమపరచడానికి – మత్తయి 5:16; 1 పేతురు 2:9

### పవిత్రీకరణలో ఇమిడి ఉన్న అంశాలు

ఎ. ప్రత్యేకంగా ఉండడం/వేరుపరచుకోవడం – ఇది దేవునితో ఉన్న మన యధార్ధ సంబంధం. దీనినే ప్రత్యేకపరచుకోవడం అంటారు.

2. శుద్ధి చేసుకోవడం – దేవుని ఎదుట మన యధార్ధ స్థితి శుద్ధి చేసుకోవడం మన బాధ్యత.

### పవిత్రీకరణలో దేవుని పాత్ర

దేవుడు మనలో ఉండి తన వాక్యం ద్వారా ఆత్మద్వారా తన కార్యమును (పవిత్రీకరణ) కొనసాగి స్తాడు (1 థెస్స 5:23; ఫిలిప్పీ 2:13). దేవుడు తన పిల్లలను క్రమశిక్షణ చేస్తాడని హెబ్రీ రచయిత చెబుతాడు (హెబ్రీ 12:5–11). దేవుని చిత్తము చేయడానికి దేవుడు మిమ్మును సిద్ధపరచును గాక అని దీవిస్తాడు. దేవుని మూలంగా యేసు మన జ్ఞానము, నీతి, పరిశుద్ధత అయ్యాడు అని పౌలు ఆయనను గూర్చి చెప్పాడు.

ప్రత్యేకంగా మన జీవితాల్లో పరిశుద్ధాత్ముడు మార్పు తీసుకొని వచ్చి పరిశుద్ధతలో ఎదిగేటట్లు చేస్తాడు (1 పేతురు 1:2). పౌలు 2 థెస్స 2:13లో ఆత్మ వలన పరిశుద్ధత పొందిన వారని విశ్వాసులను సంబోధిస్తాడు. పరిశుద్ధాత్ముడు మనలో ఆత్మ ఫలాన్ని కలుగ చేస్తాడు. పవిత్రీకరణలో ఎదిగినప్పుడు మనం ఆత్మచేత నడిపించబడతాము, నింపబడతాము, నియంత్రించబడతాము.

### పవిత్రీకరణలో మన బాధ్యత

1. మన ప్రాచీన స్వభావం సిలువవేయబడినదని మనం ఎరగాలి (రోమా 6:6).
2. పాపము విషయంలో మనము మృతులము అని ఎంచుకోవాలి (రోమా 6:11).
3. మీ అవయవాలను నీతికి సాధనముగా అప్ప గించుకొనుడి (రోమా 6:13).

### పవిత్రంగా జీవించాలని దేవుని హెచ్చరికలు

1. సమస్త కల్మషం నుండి మనలను పవిత్రులుగా చేసుకొందము (2 కొరింథీ 7:1) అని పౌలు చెప్పాడు.

2. క్రీస్తులో మనలను పరిశుద్ధంగా జీవించాలని కోరుకొంటున్నాడు ( 1 పేతురు 1:14)
3. మానవుని సంపూర్ణంగా విమోచించడం దేవుని చిత్తం (హెబ్రీ 7:24)

### మనలను పవిత్రీకరించే సాధనాలు

1. యేసురక్తం – హెబ్రీ 13:12; 9:14
2. దేవుని వాక్యం – కీర్తన 119:9; ఎఫెసీ 5:27; యోహాను 17:17
3. పరిశుద్ధాత్ముడు – 1 కొరింథీ 6:9–11; గలతీ 5:16

### పవిత్రీకరణ ఎలా జరుగుతుంది?

పవిత్రీకరణ దేవుని చొరవ మానవుని సహకారంతో జరిగే పక్రియ. మనలో పవిత్రీకరణ జరగాలంటే అంతరంగంలో పవిత్రంగా ఉండాలనే కోరిక ఉండాలి (ఉదా. యోసేపు, దానియేలు). మనకు ఆ కోరిక/ఆశ లేకుండా దేవుడు మనలో తన పని కొనసాగించలేడు (2 కొరింథీ 7:1; హెబ్రీ 10:14; హెబ్రీ 10:22).

### పవిత్రీకరణలో మూడు స్థాయిలు

#### 1. తక్షణ పవిత్రీకరణ

నూతన జన్మ అనుభవం పొందినప్పుడు మన పాపాలన్నీ కడిగివేయబడతాయి. మనము పరిశుద్ధాత్మను పొందుతాము (యోహాను 3:5). పరిశుద్ధాత్ముని పరిచర్య అయిన పవిత్రీకరణ మొదలవుతుంది.

#### 2. పురోగమన పవిత్రీకరణ

దేవుని ఇష్టానికి, మన ఇష్టానికి వచ్చే పోరాటం తర్వాత, ఆయన ఇష్టానికి అంగీకారం తెలిపిన తర్వాత పరిశుద్ధాత్ముడు మనలను స్వాధీనం చేసుకొంటాడు, నియంత్రిస్తాడు, మన మీద ఆధిపత్యం చూపిస్తాడు. దీనిని పరిశుద్ధాత్మ చేత నింపబడడం అంటారు. అప్పుడు మనలను నియంత్రించేది పరిశుద్ధాత్ముడే గాని అహం కాదు. అప్పుడు మనము ఆత్మానుసారంగా నడచుకొంటాము లేక ఆత్మచేత నడిపించబడతాము. దీనినే విశ్వాసమును బట్టి నడుచుకోవడం లేక ప్రేమ కలిగి నడుచుకోవడం, వెలుగులో నడుచుకోవడం అని మనం చెప్పవచ్చు.

#### 3. సంపూర్ణ పవిత్రీకరణ

మనం ఆత్మానుసారంగా నడుచుకొంటున్నప్పుడు సంపూర్ణతకు చేరువగా వెళతాము. ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయనలా మార్చబడతాము. తన మహిమ ఎదుట మనలను ఆయన నిర్దోషంగా నిలబెడతాడు (యూదా 1:24). పవిత్రీకరణ దేవుని వల్ల, దేవుని కొరకు, దేవుని చేత మన సహకారంతో జరిగే ప్రక్రియ. మనకు పవిత్రంగా జీవించాలి అనే ఆశ లేకున్నప్పుడు దేవుడు మనలను పవిత్రంగా జీవించమని ప్రేరేపించవచ్చు గానీ మన ఇష్టానికి వ్యతిరేకంగా తన ఇష్టాన్ని మన మీద రుద్దడు. మన అంగీకారం లేకుండా దేవుడు మనతో తన పని జరిగించలేడు.

### పవిత్రీకరణ వల్ల లాభాలు

1. శిక్షావిధిలేదు – రోమా 8:1
2. ఓటమి లేదు – రోమా 8:11,15
3. ఎడబాటు లేదు – రోమా 8:35,39

### ముగింపు

పవిత్రీకరణ అంటే అణచివేసుకోవడం కాదు. బాహ్య పవిత్రతను కాపాడుకోవడానికి అంతరంగంలో పోరాడడం కాదు. పవిత్రీకరణ అంటే పాప నిర్మూలన కాదు. పాపం చనిపోలేదు కానీ క్రైస్తవులు పాపానికి చనిపోయారు. పాప స్వభావానికి చనిపోయారు. మన పాప స్వభావము సిలువ వేయబడింది (రోమా 6:6), చనిపోయినవారు పాప విముక్తులు (రోమా 6:7). ఆత్మానుసారంగా నడుచుకొండి అప్పుడు మీరు శరీరేచ్ఛలు నెరవేర్చరు (గలతీ 5:16). ఆత్మచేత శరీర క్రియలు చంపిన యెడల మీరు జీవించెదరు (రోమా 8:13). అందుకోసం మన అంతరంగ పురుషుడు బలంగా ఉండాలి (ఎఫెసీ 3:15). మనం ఆత్మీయంగా ఎదగాలి, పరిపక్వతలోకి రావాలి. మనలో పనిచేసే ఆత్మ నియమం పాప, మరణ నియమాన్ని జయిస్తుంది (రోమా 8:2).

ఒక క్రైస్తవుడు/విశ్వాసి/తిరిగి జన్మించిన వ్యక్తి పాపపు శక్తికి దాసోహం కానక్కరలేదు. పాప ప్రభావం క్రింద జీవించనవసరం లేదు. జీవించకూడదు కూడా. విశ్వాసులు క్రీస్తులో తమ విజయవంతమైన స్థానాన్ని కనుగొని పాపపు శక్తి నుండి విడిపించబడి పరిశుద్ధమైన జీవితం జీవించాలని దేవుని ఆశ. ఆ ఆశను నెరవేరుద్దామా?

– జి. జెర్మియా ప్రసాద్, ఏపి–ఇజియఫ్ స్టాఫ్,
నంద్యాల



# 1:2 గ్రాడ్యుయేట్ సెల్

## నాణ్యమైన గ్రాడ్యుయేట్స్, పరిచర్యకోసం

"మనం తోటి మానవాళి పట్ల చేసే అమానుషమైన లేక క్రూరమైన పాపం వారిని ద్వేషించడం కాదు గాని వారి పట్ల ఉదాసీనత లేక అశ్రద్ధ వైఖరి కనపరచడమే అని జార్జి బెర్నార్డ్‌షా" అంటాడు. మన పరిచర్యలో మనం వ్యక్తుల్ని తరచుగా ద్వేషించం కానీ వారిపట్ల అశ్రద్ధ వైఖరిని మాత్రం కనపరుస్తాము. దాని ఫలితంగానే వ్యక్తిగత శ్రద్ధ తగ్గి ఆత్మీయ జీవితాలలో, పరిచర్యలో నాణ్యత కొరవడింది. పరిచర్య ప్రారంభమై 70 సంవత్సరాలు అయిన సందర్భంగా మనందరం వేడుకలు జరుపుకున్నాము. ఈ 70 సంవత్సరాల మన పరిచర్యలో దేవుని స్తుతించే విషయాలు, ఆయన నమ్మకత్వాన్ని కొనియాడే విషయాలు కోకొల్లలుగా ఉన్నాయి.

పరిచర్య భారతదేశం అంతా విస్తరించబడింది, విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ సంఖ్య గణనీయంగా పెరిగింది, అనేకమంది మిషనరీస్‌గా అనేక ప్రాంతాలకు వెళ్ళారు, అనేక మంది పూర్తికాల సేవకు సమర్పించుకున్నారు. పాస్టర్స్‌గా ఉంటూ అనేక సంఘాలను నెలకొల్పారు. అనేక మంది తమ జీవితాలు, ఉద్యోగాల ద్వారా సంఘాలను, సమాజాన్ని ప్రభావితం చేయగలిగారు. అనేక క్రైస్తవ కుటుంబాలు కట్టబడ్డాయి. ఓపెన్ హోమ్స్‌గా ఉంటూ పరిచర్యకు నెలవులయ్యాయి. వీటన్నింటిని బట్టి దేవున్ని స్తుతించాలి. అయితే కాలం గడిచేకొద్ది పరిచర్యలో, జీవితాలలో నాణ్యత క్రమంగా తగ్గుతూ వస్తుంది. దీనికి అనేకమైన కారణాలు ఉన్నా ప్రధానమైన కారణం మాత్రం వ్యక్తుల పట్ల శ్రద్ధ కొరవడడం. వ్యక్తులను వ్యక్తిగతంగా పట్టించుకోవడం, వారి కొరకు వ్యక్తిగతంగా ప్రార్థించడం, వ్యక్తిగతంగా వారి అక్కరలు తెలుసుకొని వాటిని తీర్చే విధానంలో మాట్లాడడం అనే దానిని నిర్లక్ష్యం చేస్తున్నాము. అన్ని విషయాలను గుంపులుగా, వ్యక్తిగతంగా చేయాల్సినవి సామూహికంగా చేస్తున్నాము. దీని ఫలితంగా వ్యక్తుల యొక్క అన్నిరకాల అసరతలు తీర్చబడడం లేదు.

ఆత్మీయంగా ఎదగవలసినంతగా ఎదగటం లేదు, సరైన విధానంలో శిక్షణ పొందడం లేదు, శిష్యులుగా, నాయకులుగా తయారవ్వడం లేదు. ఎక్కువమంది విశ్వాస విద్యార్థులు గ్రాడ్యుయేట్స్‌గా మారడం లేదు. కెరియర్ విషయంలో సరైన అవగాహన కలిగి ఉండటం లేదు. వివాహ విషయాలలో వాక్యానికి విధేయత చూపడం లేదు. దేవుని చిత్తంలో కుటుంబాలుగా కట్టబడిన యవ్వనస్తులైన గ్రాడ్యుయేట్స్ కుటుంబ జీవితాలలో లోకం యొక్క పోకడలు కనబడుతున్నాయి. ఆత్మలపట్ల భారాన్ని రగిలించలేని నులివెచ్చనైన జీవితాలు, ఇతరులను ప్రభావితం చేయలేని సాక్ష్య జీవితాలు, దేవుని కొరకు రోషంగా నిలబడలేక సుఖవలయాలలో ఉంటూ, నిస్సారమైన బ్రతుకును గడుపుతున్నాము. అలాగే ఫలవంతంగా ఉండి నిలిచి ఉండే పరిచర్యను చూడలేకపోతున్నాము. ఈ సమస్య యొక్క పరి

ష్కారం కొరకు అందరిపట్ల వ్యక్తిగత శ్రద్ధ అనేదానిని పెంపొందించడానికి యల్అర్పి-2030లో మెంబర్ కేర్ అనే అంశాన్ని ఒక అంశంగా చేర్చడం జరిగింది. దీని ద్వారా వ్యక్తిగత శ్రద్ధను అందరికి అందించాలని ప్రణాళికలను రూపొందించడం జరిగింది. అయితే విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ కొరకు 1:3 మైక్రోప్రేయర్ సెల్స్ ఉన్నాయి. వారికి మెంటర్స్ ఉన్నారు. మెంటరింగ్ జరుగుతుంది. అయితే గ్రాడ్యుయేట్స్‌కు మెంటర్స్ ఉండడం లేదు. వారికొరకు మెంటరింగ్ సెల్స్ కూడా లేవు. దీని ఫలితంగా గ్రాడ్యుయేట్స్‌కు మెంబర్ కేర్ అందడం లేదు. దీని అవసరతను గుర్తించి ఏపి-ఇజియఫ్ వారు పెద్దల సలహాల మేరకు 1:2 గ్రాడ్యుయేట్ సెల్స్ అనేవాటి గురించి ఆలోచించి వాటిని అన్ని ఇజియఫ్‌లలో ఉన్న యంగ్ గ్రాడ్యుయేట్స్‌కు అమలు చేయాలని ఆలోచించడం జరిగింది.

## 1:2 గ్రాడ్యుయేట్ సెల్

ఒక సీనియర్ గ్రాడ్యుయేట్ ఫ్యామిలీ, ఇద్దరు యంగ్ గ్రాడ్యుయేట్స్‌ను కానీ లేదా ఇద్దరు వివాహిత కుటుంబాలను గానీ మెంటరింగ్ చేయడం.

## అవసరత

గ్రాడ్యుయేట్స్ పరిచర్యకు వెన్నెముకవంటి వారు. పరిచర్యలో వెనకవుండి ముందున్న విద్యార్థులను నడిపించడంలో గ్రాడ్యుయేట్స్ కీలకపాత్ర పోషిస్తారు. కావున వారి ఆత్మీయత, వాక్య పరిజ్ఞానం, విషయ పరిజ్ఞానం విద్యార్థుల కంటే హెచ్చుగా ఉండాలి. అప్పుడు విద్యార్థులను, తోటి గ్రాడ్యుయేట్స్‌ను సరైన విధానంలో నడిపిస్తారు. కానీ ప్రస్తుతం అటువంటి వారి సంఖ్య తక్కువగా కనపడుతుంది. మనకే త్రోవ తెలియనప్పుడు ఇంకొకరికి త్రోవను చూపించలేము. కాబట్టి ఖచ్చితంగా గ్రాడ్యుయేట్స్ అన్ని విధాలుగా ఎక్విప్ అవ్వాలి. కాబట్టి ఈ సెల్స్ యంగ్ గ్రాడ్యుయేట్స్ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడతాయి.

## ఎవరికి ఎవరు?

మన ఇజియఫ్‌లో సీనియర్ గ్రాడ్యుయేట్స్ ఉంటే వారు యంగ్ గ్రాడ్యుయేట్స్‌ని మెంటరింగ్ చేయవచ్చు. ఆత్మీయ పరిపక్వత కలిగి వాక్యానుసారంగా నడిపించగలిగిన వారైతే మేలుకరంగా ఉంటుంది.

## ఏ యే విషయాలు?

శారీరక, ఆత్మీయ, మానసిక, సాంఘికపరమైన విషయాలు. బిబ్లికల్, ఆర్గనైజేషన్, కెరీర్, వివాహ విషయాలు, కుటుంబ జీవితాల గురించి గైడ్ చేయాలి.

## ఎప్పుడెప్పుడు?

ఏ సమయంలో అయినా, వారానికి ఒకసారి లేదంటే రెండు వారాలకి ఒకసారి ఈ సెల్‌ను కలిగి ఉండటం మంచిది. అవసరతను బట్టి సమయాన్ని కేటాయించుకుంటే మంచిది.

## లాభాలు

వ్యక్తిగతంగా గ్రాడ్యుయేట్స్‌తో మాట్లాడడం ద్వారా విశ్వాసంలో వారి స్థాయి, వారు ఎదుర్కొంటున్న శోధనలు, బాధలు, సవాళ్ళు, హింసలు, వారి ఆత్మీయ విలువలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకొని గైడ్ చేయవచ్చు. అలాగే వాక్య పరిజ్ఞానం, వాక్యానికి విధేయత చూపడం గురించి నేర్పించవచ్చు. అనుదిన వాక్య ధ్యానం, ప్రార్థనా జీవితము, ఆత్మలపట్ల భారం, బైబిల్ సిద్ధాంతాలు, తప్పుడు బోధలు, ఓపెన్ హోమ్, మానవ సంబంధాలు, పరిచర్యలో వారి పాత్ర, శిష్యత్వం, శిష్యులను తయారు చేయడం, సాక్ష్యాన్ని లేవనెత్తడం, నాయకత్వం పట్ల అవగాహన కల్పించవచ్చు. ఆత్మీయ వరాలు, టాలెంట్స్ గుర్తించి పరిచర్యకు మేలుకరంగా వాటిని వాడేలా ప్రోత్సహించవచ్చు. వీటన్నిటి ద్వారా వారి వ్యక్తిగత జీవితాలకు, పరిచర్యకు, సంఘానికి సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది. జీవితాలలో, పరిచర్యలో నాణ్యత పెరుగుతుంది, విద్యార్థులను సరైన విధానంలో నడిపించడానికి, వారిని ట్రైన్ చేయడానికి తోడ్పడుతుంది.

## వాక్యాధారం

బైబిల్లో మోషేకు యిత్రో ఇచ్చిన చిన్న సలహా పెద్ద సమస్యలకు పరిష్కారాన్ని ఇచ్చింది. నయోమి రూతుకి ఇచ్చిన సలహాలను బట్టి రక్షకుడు ఈ భూమి మీదకు వచ్చే ప్రణాళిక నేరవేర్చబడింది. మొర్దెకై ఎస్తేరుని మందలించడాన్ని బట్టి సుఖవలయంలో నుండి బయటకు వచ్చి లక్షల మంది యూదులు నశించిపోకుండా కాపాడగలిగింది. అకుల ప్రిస్కిల్ల అపొల్లోను సరైన బోధవైపుకు నడిపించగలిగారు. పౌలు అనేకమంది విశ్వాసుల ఆత్మీయ వరాలను గుర్తించి వారిని ప్రోత్సహించడం ద్వారా వారు

సంఘాలకు ఆశీర్వాదంగా మారారు. ఇవన్నీ వ్యక్తిగత శ్రద్ధ చూపడం ద్వారా జరిగాయి.

మనమందరం వ్యక్తుల జీవితాలలో, పరిచర్యలో నాణ్యత గురించి, వస్తున్న నూతన పోకడల గురించి మాట్లాడుతున్నాము. నాణ్యత కొరవడుతుంది అని బాధపడుతున్నాము. ఇది మంచి సంగతే. కానీ పరిష్కార దిశగా ఆలోచించడంలేదు. అది చేయగలిగితే దేవుని సహాయంతో మనం ఫల భరితమైన జీవితాలు, పరిచర్యను చూడగలము. దీనిలో సీనియర్ గ్రాడ్యుయేట్స్ పాత్ర ఎంతో ఉంది. సీనియర్ గ్రాడ్యుయేట్స్ దేవుని ప్రేమని బట్టి వారి సమయాన్ని వెచ్చించి ఈ విషయాలపై దృష్టి సారిస్తే మనం మంచి ఫలితాలను చూడగలము.

"మనం రాయబోయే చరిత్ర పేపరు మీద రాసేది కాదు, వ్యక్తుల జీవితాలను ప్రభావితం చేసేది. ఇది గ్రహిస్తే మన సామర్ధ్యాలను అన్నిటిని కూడగట్టుకొని ఆ పని కొరకే శ్రమిస్తాము" అని అన్నారు పికేడి లీ. కాబట్టి సీనియర్ గ్రాడ్యుయేట్స్, ఇజియఫ్ కమిటీలు ఈ సెల్స్‌ను ప్లాన్ చేసి గ్రాడ్యుయేట్స్ సర్వోతోముఖాభివృద్ధికి తోడ్పడి వారు పరిచర్యకు అన్నివిధాలుగా ఉపయోగపడేలా చూడగలగాలి.

## చేయకపోతే వచ్చే నష్టాలు

మనలో అనేకమంది విద్యార్థుల పరిచర్య చేయడానికే సమయంలేదు ఇవన్నీ ఎలా కుదురుతాయని ఆలోచిస్తాము. కానీ కుదుర్చుకుంటే అన్నీ అవుతాయి, ఇప్పటికే సీనియర్ గ్రాడ్యుయేట్స్ ఉన్న కొన్ని ఇజియఫ్‌లలో ఇవి జరుగుతున్నాయి. ఒకవేళ సమయం లేదని గ్రాడ్యుయేట్స్ పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపకపోతే పరిచర్యలో నాణ్యత ఇంకా తగ్గిపోతుంది. ఎందుకంటే బైబిల్ స్టడీ నాయకులు, స్పీకర్స్, మెంటర్స్, కమిటీ మెంబర్స్, క్యాంపు కోఆర్డినేటర్స్, త్యాగపూరితంగా ఇచ్చేవారు, టెంట్ మేకర్స్, ఫుల్ టైం వర్కర్స్, సంఘాల్లో కీలక పాత్ర పోషించేవారు, వివాహాలు చేసేవారు, ఓపెన్ హోమ్స్‌గా ఉండేవారు అందరూ గ్రాడ్యుయేట్సే. కాబట్టి నాసిరకం శిక్షణతో, ఆత్మీయతతో ఇతరులను నడిపిస్తే వారు కూడా నాసిరకంగానే ఉంటారు. కావున ఈ నష్టాలు జరగకుండా మనవంతు బాధ్యతను మనం చేద్దాం.

– టి.సుధా థామస్, నర్సరావుపేట




చుట్టూ ఉంది లోక సముద్రం!
గమ్యం తెలియని జీవులన్నీ
అక్కడికక్కడే ఈదుతూ ఉన్నాయి

లోక ప్రవాహం
దినదినమూ పెరుగుతోంది
బలహీనమైనవి భయపడుతున్నాయి
చచ్చినవి ప్రవాహంతో కొట్టుకుపోతున్నాయి

రక్షణ పొందిన ప్రతి జీవికీ
ఉన్నది ఒక్కటే మార్గం!
జీవిత గమ్యం చేరాలంటే
లోకానికి ఎదురీదాలి!

మధ్య మధ్యలో పరీక్షలు పెట్టినట్లు
ఆటుపోట్లు అలలెత్తుతూ ఉంటాయి
శ్రమల తుఫాన్లు వడిగా వీస్తుంటాయి
విమర్శల వరదలు పొంగి ప్రవహిస్తుంటాయి
శోధన సుడిగుండాలు చుట్టుముడుతూ ఉంటాయి

ఇక్కడ ధ్యేయం
జీవిత పరీక్షల్లో పాసవ్వడమే!
రెట్టింపు ఉత్సాహంతో ఎదురీదడమే!

ఎదుర్కొనే ప్రతీ పరీక్ష
పడగొట్టడానికి కాదు
మరో మెట్టులో నిలబెట్టడానికి!

పాసయిన హృదయం
మరో ఉన్నత స్థాయికి చేరుకోవాలి
ఫెయిలైన హృదయం
పాఠాల్ని నేర్చుకుంటూ
మళ్ళీ కొనసాగిపోవాలి

నడి సముద్రంలో ముంచేసే
లోక తత్వ జ్ఞానాలు
మెలిపెట్టే సిద్ధాంతాలు
ఎదురవుతూనే ఉంటాయి
వాటిని దైవ జ్ఞానంతో తిరస్కరించాలి

సత్య వేద సారమే
గమ్యాన్ని చేరుస్తుంది!
క్రీస్తులో మార్పు చెందిన మనసే
లోకానికి ఎదురీదుతుంది!

– యస్.ఈశ్వర్ (ఆర్కిటెక్ట్), మెహదీపట్నం జోన్

# లే! మేలుకో! పనిని చేపడదాం

**న్యాయాధిపతులు 4,5 అధ్యాయాలు**

## నేపథ్యం

చరిత్రలో, ఈ తరములో ప్రజలు, దేవుని బిడ్డలు ఎదుర్కొనే అతిపెద్ద సవాళ్ళు, సమస్యలు ఏంటి? శక్తికి మించిన సమస్యలతో అందరు భయపడి దాక్కొనే పరిస్థితులలో నీవు ఏమి చేస్తావు? ప్రజల సమస్యలకు, భయాలకు, నాయకత్వ సంక్షోభానికి, సంశయానికి స్పందించి దేవుని ఉద్దేశాలను తెలుసుకొని, ధైర్యంతో దేవుని మీద ఆధారపడి తననుతానే నాయకత్వ బాధ్యతకు అప్పగించుకొని దేవుని సహాయంతో సంశయిస్తున్న నాయకులను, ప్రజలను కలుపుకొని దేవుని కోసం సాహసకార్యాలను చేసిన డేరింగ్ లీడర్ గూర్చి తెలుసుకొందాము.

## ప్రశ్నలు

1. ఏహూదు చనిపోయిన తరువాత దేవుని ప్రజల పరిస్థితులు ఎలా ఉన్నాయి? దెబోరా ఎవరు? అలాంటి సమయంలో ఏమి చేస్తుంది? దెబోరా నుంచి ఏం నేర్చుకొంటాము? 4:1-5; 5:6-8,12
2. నాయకురాలిగా దెబోరా ప్రజల పట్ల దేవుని ఉద్దేశాలను ఎలా గుర్తించింది? వాటిని సఫలం చేయడానికి ఆమె ఎలాంటి ప్రణాళికలను, వ్యూహాలను వేసుకొంది. మనము ఏమి నేర్చుకొంటాము?
3. దేవుని పనిని చేపట్టడానికి వెనకాడుతున్న బారాకును ఎలా పురికొల్పింది? ఆమె నాయకత్వంను గూర్చి ఏమి తెలుసుకొంటాము? ఎలా అనుకరించవచ్చు?
4. సాహసంతో శక్తికి మించిన పనిని చేపట్టిన దెబోరాకు దేవుడు ఎలా సహాయం చేశాడు? వ్యక్తులను సమకూర్చిన విధానం గమనించండి. దెబోరా ధైర్యానికి రహస్యం ఏంటి?
5. నాయకురాలుగా దెబోరా, బారాకుతో పాడిన పాటలో పొందిన విజయానికి కారణం ఎవరికి ఆపాదించింది? ఎవరి పాత్రలను ప్రశంసించింది? ఏమి నేర్చుకొంటాము? (5వ అధ్యాయము)



6. దెబోరా తన ఫెమినైన్ గ్రేసెస్ (స్త్రీయత్వము)ను నాయకత్వపు బలాలుగా దేవుని సహాయంతో ఎలా ఉపయోగించిందో చర్చించండి.
7. సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థి లోకాన్ని చూచి పట్టీపట్టనట్టుగా ఉంటావా? పనిని చేపట్టుటకు మేలుకొంటావా? లే!

ఈ చరిత్రను పరిశుద్ధాత్మ దేవుడు రాయించడంలో ఉద్దేశం బహు కఠినమైన పరిస్థితులలో స్త్రీ, పురుషుల వివక్ష లేకుండా వారి నాయకత్వాన్ని ఉపయోగించుకొంటాడని నేర్చుకొంటాము. దేవుని బలముతో సంతోషంగా, ఇష్టపూర్వకంగా, స్వయం సమర్పణతో నాయకత్వానికి ముందుకురావడమే దెబోరా జీవిత సందేశము మన సమర్పణకు ప్రేరణ. దెబోరా నాయకురాలిగా దేవుని ప్రణాళికలను నెరవేర్చడానికి ఇతర వ్యక్తుల పాత్ర గుర్తించడం, వారిని ప్రోత్సహించడం, కలుపుకొని ముందుకెళ్ళడం, బహుళ నాయకత్వానికి, పంచుకొనే నాయకత్వానికి మంచి ఉదాహరణ. మనం అనుసరించడానికి ఒక మాదిరి.

**– డా. జే. రత్న గ్రేస్,** వైజాగ్

ప్రత్యేకం



# కృతజ్ఞతతో జీవించడం

*"మనం కేవలం కృతజ్ఞతాభావాన్ని మాత్రమే అనుభవించాలని దేవుడు కోరుకోడు, కానీ దేవునికి కృతజ్ఞతలు చెబుతూ దానిని మన జీవితాలతో చూపించాలని కోరుకొంటాడు."*

*– ఆర్.సి. స్ప్రోల్*

పాలికార్ప్ (క్రీ.శ. 70–156) యోహాను శిష్యుడు, స్మూర్నకు బిషప్పు. 86 సం॥ల వయసులో ఆయనను ఒక కొయ్యకు కట్టి తగులబెట్టారు. నీ విశ్వాసాన్ని విడిచిపెట్టమని గవర్నర్ పాలికార్ప్‌ను అడిగినప్పుడు "ఎనభై ఆరేళ్ళు ఆయనను సేవించాను. ఆయన నాకే హాని చేయలేదు. నన్ను రక్షించిన నా రాజును గూర్చి నేను దూషణలెలా మాట్లాడగలను?" అని గొప్ప శబ్దంతో చెప్పాడు. ఆయన చనిపోయేముందు "సర్వశక్తిమంతుడవైన ప్రభువా, నీ సాక్షులలో ఒకనిగా ఉండడానికి నన్ను యోగ్యునిగా ఎంచినందుకు నేను నిన్ను స్తుతించుచున్నాను. నిత్యమూ నీకే మహిమ కలుగును గాక! ఆమేన్!" అని చెబుతాడు. చనిపోయే సమయంలో కూడా దేవునిపట్ల కృతజ్ఞతా జీవితం కలిగి, ఆయనను స్తుతిస్తూ, మహిమపరచడం నేటి విశ్వాసులకు గొప్ప మాదిరి. "మరణము వరకు నమ్మకముగా ఉండుము నేను నీకు జీవకిరీటమిచ్చెదను" అనే ఈ మాటలు పాలికార్ప్‌కు కూడా వర్తిస్తాయి.

"ఇరుకైన గదిలో, కాళ్ళకు చేతులకు సంకెళ్ళతో, అన్యాయంగా నిందలు, శ్రమలు, హింసలు, బాధలు భరిస్తూ, చెరసాలలో మగ్గిపోతున్న అపొస్తలుడైన పౌలు, తన పరిస్థితిని బట్టి ఫిర్యాదు చేయడానికి అర్హత ఉన్నా అతని హృదయం ప్రభువు పట్ల ప్రేమతో, కృతజ్ఞతతో నిండి, ఆయనను స్తుతిస్తూ, ప్రతి విషయంలో కృతజ్ఞతాస్తుతులు చెల్లించమని విశ్వాసులను ప్రోత్సహించాడు (ఎఫెసీ 5:19–20, ఫిలిప్పీ 4:4–7). ప్రతికూల పరిస్థితుల్లో కూడా కృతజ్ఞతాపూర్వకంగా ఎలా జీవించాలో ఆయనకు బాగా అర్థం అయ్యింది. అలానే జీవించాడు.

### కృతజ్ఞత అంటే?

దేవుడు చూపించిన అత్యున్నతమైన కృపకు మన ప్రతిస్పందనే కృతజ్ఞత. దేవుడు చేసిన అనేక మేళ్ళను జ్ఞాపకం చేసికొని స్తుతించడమే గాక కృతజ్ఞతా వైఖరిని/స్వభావాన్ని కలిగి ఉండాలి. ఇది ప్రతి విశ్వాసి కలిగి ఉండాల్సిన అత్యంత విలక్షణమైన వైఖరి. ఇది మనం అప్పుడప్పుడూ పెట్టుకొనే కృతజ్ఞతా కూడిక లాంటిది కాదు, విదేశాల్లో చేసుకొనే 'థ్యాంక్స్ గివింగ్ డే' లాంటిది కూడా కాదు. మనం జీవితాంతం కలిగి ఉండాల్సిన సద్గుణం. కృతజ్ఞతా ఉద్దేశపూర్వకంగా, ఎంచుకొని చేయాల్సిందే కానీ అది సహజంగా రాదు. అది మన వైఖరి, మన జీవనశైలి కావాలి.

### దేవునిపట్ల కృతజ్ఞత ఎందుకు అవసరం?

బైబిల్లో చాలా చోట్ల దేవుని పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలని ఆజ్ఞాపించినట్లు చూస్తాం. కృతజ్ఞతకు

దేవుడే మాదిరి. "మీరు చేసిన కార్యమును....చూపిన ప్రేమను మరచుటకు దేవుడు అన్యాయస్థుడు కాదు" (హెబ్రీ 6:10). కృతజ్ఞత చూపించకపోతే అది పాపంగా ఎంచాడాయన. దేవునిపట్ల కృతజ్ఞతకలిగి ఉండడం నేర్చుకొనేలా ఇతరుల ప్రయోజనం కోసం బహిరంగంగా యేసు క్రీస్తు కూడా దేవునికి కృతజ్ఞతలు తెలిపారు (యోహాను 11:41-42, లూకా 24:30, మత్తయి 14:19, 15:36).

ఆయన ఏమై ఉన్నాడో, ఆయన గుణలక్షణాలను గుర్తు చేసికొని వాటికొరకు కృతజ్ఞతలు చెల్లించాలి. ఆయన పరిశుద్ధుడు, ప్రేమామయుడు, సార్వభౌముడు, న్యాయవంతుడు, మంచివాడు, దయగలవాడు, కరుణా సంపన్నుడు... ఇంకా ఎన్నో. కీర్తనాకారులు దేవునికి స్తుతిగానం చేయమని ప్రోత్సహించారు.

దేవుడు చేసిన మేళ్ళలో, ఆశీర్వాదాల్లో అత్యున్నతమైనది రక్షణ. యేసుక్రీస్తు చేసిన సిలువ బలియాగం ద్వారా పాపపు దాస్యం నుండి, ఉగ్రతనుండి విడిపించి, మన జీవిత విలువను పెంచి, ఆయన రాజ్య వారసులుగా మనల్ని చేసినందుకు కృతజ్ఞత చెల్లించకుండా ఎలా ఉండగలం? (కొలస్సీ 1:13; 2 కొరింథీ 9:15). ఆ రక్షణలో కొనసాగడానికి పరిశుద్ధాత్మ దేవుడు సహాయం చేస్తూనే ఉన్నారు (ఫిలిప్పీ 2:13).

కరోనా కాలంలో మనకి జీవితం/ప్రాణం విలువ బాగా అర్థమయ్యింది. దేవుడిచ్చిన ఈ అమూల్యమైన జీవితం, ఆయుష్షు, మనలను తనవైపుకు ఆకర్షించుకున్న విధానం, సహవాసంలో మన మెంటార్స్, దైవజనులు, వారిద్వారా ఇచ్చిన ఆత్మీయ మేళ్ళు, ఆరోగ్యం, విద్య, టీచర్స్, ఉద్యోగాలు, కుటుంబాలు, సంబంధాలు, ఆర్థిక సహాయం, ఉచితంగా ఇచ్చిన అనేక వనరుల కొరకు,...ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో.. ఈ లిస్ట్‌కి అంతేలేదు. ఇవన్నీ మన సొంత తెలివితోనో, కష్టంతోనో సంపాదించుకొన్నవి కావు. దేవుడు దయచేసినవే. అందుకే ఆయనకు కృతజ్ఞతలు చెల్లించాలి. క్రమం తప్పకుండా, నిరంతరం దేవునికి కృతజ్ఞతలు చెప్పడం మన జీవితం పట్ల ఆయన చిత్తం (1 థెస్స 5:18). ఒక అబ్బాయి బ్రష్ చేస్తున్నప్పుడు ఈ వచనం గుర్తుకొచ్చి, బ్రష్, టూత్ పేస్ట్ కోసం, ఫుడ్‌ని ఆనందంగా తినడానికి దేవుడిచ్చిన దంతాలను బట్టి స్తుతించాడట. మనం భోజనం చేస్తున్నప్పుడు భోజనం కోసం, వండిన వారికోసం కృతజ్ఞతలు చెప్తాం కానీ పండించిన రైతుల కోసం కూడా చెప్పొచ్చు.

దావీదు తన జీవితంలో కృతజ్ఞతలు చెల్లించడం ఒక అలవాటుగా చేసుకొన్నాడు (కీర్తనలు 103). దానియేలు తనపై అసూయపడిన వారు కుట్ర పన్నుతున్నప్పుడు యధావిధిగా ప్రార్థించాడు, కృతజ్ఞతలు చెల్లించాడు. "దేవుని ప్రేమించువారికి...సమస్తం మేలుకొరకే జరుగుచున్నాయని" (రోమా 8:28). పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా అవి దేవుని ఆధీనంలోనే ఉంటాయని, సార్వభౌమాధికారంతో వాటిని మనజీవితాల్లో అనుమతించాడని మనం నమ్మితే, కృతజ్ఞతతో జీవించవచ్చు. పండంటి పాపాయి కావాలంటే డెలివరీ పెయిన్స్/సిజేరియన్ కోసం కృతజ్ఞతలు చెప్పాల్సిందే.

## దేవునిపట్ల కృతజ్ఞత ఎలా చూపించాలి?

ఆయన పట్ల కృతజ్ఞతని చూపించడమంటే ఆయనకి ఇష్టంగా జీవించడం, ఆయనను ప్రేమించడం, ఆయనతో సమయం గడపడం (మౌనధ్యాన సమయం, ప్రార్థన), పాటలతో స్తుతించడం, ఆయనను అనుసరించడం, ఆయన ఇచ్చిన ఆజ్ఞలకు విధేయత చూపించడం, ఆయన ఆచరించమన్న ప్రభు సంస్కారము ఆచరించడం, ఆయన ఇచ్చిన తలాంతులు వాడడం, గివింగ్, ఆయన అప్పగించిన సేవ చేయడం, ఇతరులకు సహాయం చేయడం, వారిని ప్రేమించడం ద్వారా మనం చూపించవచ్చు. ఆదివారం సంఘంలో ఆరాధించడం మాత్రమే కాదు, వ్యక్తిగత ఆరాధన కూడా కలిగి ఉండాలి.

నేను బైబిల్ కాలేజ్‌లో ఉన్నప్పుడు నా మెంటర్/ప్రొఫెసర్ బార్బీ విండ్సర్‌కి కొన్ని విషయాల్లో సహాయం చేసేదాన్ని. సహాయం చేసిన ప్రతిసారి ఒక థ్యాంక్యూ కార్డ్ తయారుచేసి దానితో ఒక పువ్వు గానీ, చాక్లెట్ గానీ, కప్ కేక్ గాని కలిపి మా డోర్ ముందు పెట్టి వెళ్ళేది. ఆమె అలా చేయాల్సిన అవసరం లేదు. ఎంత చిన్న వారైనా, ఎంత చిన్న

సహాయమైనా తేలిగ్గా తీసుకోకూడదు. ఈ మాటలు చదువుతున్నప్పుడు మనం కృతజ్ఞతలు చెప్పకుండా ఎవరినైనా మర్చిపోయామా? ఆలోచించుకొందాం. పౌలు పరిచర్యలో సహాయం చేసిన వారిని అభినందిస్తూ, వారి ద్వారా దేవుడు ఎలాంటి పరిచర్య చేశాడో వారిని బట్టి తనెంతగా దేవునికి కృతజ్ఞత కలిగి ఉన్నాడో తెలుపుతూ తన పత్రికల్లో రాశాడు (రోమా 16). మనుష్యులు చేసిన సహాయానికే మనం అలా ప్రతిస్పందిస్తే మరి దేవుడు చేసిన లెక్కలేనన్ని మేళ్ళకి మనం ఎలా ప్రతిస్పందించాలి? ఎంత చేసినా ఆయనకు ఋణస్తులమే కదా!

## కృతజ్ఞతారాహిత్యం

దేవుడు చేసిన మేళ్ళని చాలా తేలిగ్గా తీసుకొని, ఆయనకు కృతజ్ఞతలు చెప్పడంలో విఫలమవ్వడమే కృతజ్ఞతారాహిత్యం. దేవుడు దీన్ని పాపంగా ఎంచాడు.

దేవుడు కృతజ్ఞతారాహిత్యాన్ని ఎంత సీరియస్‌గా తీసుకొంటాడన్నది లూకా 17లో చూస్తాం. యేసు ప్రభువు 10 మంది కుష్ఠురోగుల్ని స్వస్థపరచినప్పుడు ఒక్కడు మాత్రమే తిరిగి వచ్చి గొప్ప శబ్దముతో దేవుని మహిమ పరచి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తూ ఆయన పాదముల యొద్ద సాగిలపడ్డాడు. ఆయన మిగిలిన 9 మంది రాలేదని గమనించి "ఈ అన్యుడు తప్ప దేవుని మహిమ పరచుటకు తిరిగి వచ్చిన వాడెవడును అగపడలేదా?, లేచిపొమ్ము, నీ విశ్వాసము నిన్ను స్వస్థపరిచింది" అంటాడు. మిగిలిన 9 మంది చెడ్డవారని కాదు, వారు కూడా స్వస్థపడ్డారు, ఆయనమాటకు విధేయత చూపి యాజకుల దగ్గరకు వెళ్ళి ఉంటారు.కానీ వారు ఆయన చేసిన మేలును మర్చిపోయారు, తేలిగ్గా తీసుకొని ఆయనకు చెందాల్సిన కృతజ్ఞతను చెల్లించలేకపోయారు. గనుక కృతజ్ఞతను మన జీవితంలో గుర్తించడం, దానిని వ్యక్తం చేయడం చాలా ప్రాముఖ్యం. విశ్వాసం లేకుండా కృతజ్ఞత కలిగి జీవించడం అసాధ్యం.

దేవునిపట్ల ఇశ్రాయేలు ప్రజల ప్రతిస్పందన ఎలా ఉందో బైబిల్ గ్రంథంలో చాలా చోట్ల చూస్తాం (సంఖ్యా 21, కీర్తనలు 78, 1 కొరింథీ 10:1-13). దేవుడు చేసిన వాగ్దానాలను నమ్మలేక పోవడం, అసహనం ప్రదర్శించడం, దేవునిని వదిలి విగ్రహాలను ఆరాధించడం, తమకు దేవుడిచ్చిన వాటితో



తృప్తికలిగి ఉండకపోవడం, ప్రతి విషయాన్ని విమర్శనాత్మకంగా చూడడం, స్వార్థపూరితంగా ఆలోచించడం,అనేక విషయాల గురించి సణగడం చూస్తాం (1 కొరింథీ 10:1-13). సణగడం అన్నది కృతజ్ఞతకి వ్యతిరేకంగా చేసేది. వీటన్నిటి ద్వారా దేవునికి అవిధేయత చూపించి తిరుగుబాటు చేయడం ద్వారా, దేవుడు వారిని అన్య రాజుల చేతికి అప్పగించడం, అనేక విధాలుగా వారిని క్రమశిక్షణ చేయడం చూడగలం. కృతజ్ఞత, ద్వేషం కలిసి ఉండలేవు. ద్వేషం మన మనసులో ఉంటే మనం కృతజ్ఞతాభావం కలిగి ఉండలేము.

లవొదికయ సంఘం కూడా ఈ జాబితాలో ఉన్నట్టు మనం ప్రకటన 3:17లో చూస్తాం. దేవుడు వారితో "నేను ధనవంతుణ్ణి, నాకు ఏమీ అవసరం లేదు అని నీవు చెప్తున్నావు కానీ నీవు దౌర్భాగ్యుడవును, దిక్కులేనివాడవును, దరిద్రుడవును, గ్రుడ్డివాడవును, దిగంబరుడవునై యున్నావు" అంటాడు. స్వయంకేంద్రిత జీవితం కలిగిన వ్యక్తులు మాత్రమే ఇలాంటి వైఖరి కలిగి, తమ ఆస్తి, డిగ్రీలు, పదవులు, అధికారం... ఇవన్నీ నావల్లే, నా సొంత కష్టంతో, నా నైపుణ్యంతో, జ్ఞానంతో సంపాదించుకొన్నాను కాబట్టి నేనెవరికీ కృతజ్ఞతలు చెప్పాల్సిన అవసరం లేదనుకొంటారు. అవి దేవుడు చేసిన కార్యాలని గుర్తించకపోగా తమ వల్లే అవి జరిగాయన్న గర్వం కూడా ఉంటుంది. ఇలాంటి వారి గురించి పౌలు "అంత్య దినాల్లో మనుష్యులు కృతజ్ఞత లేని వారుగా మారతారని హెచ్చరిస్తున్నాడు (2 తిమోతి 3:1,2). మన చుట్టూ ఉన్న కృతజ్ఞతారాహిత్యం మనలో పొందిన మేలును తొక్కివేసే ప్రమాదం ఉంది. ఈ కృతజ్ఞతారాహిత్యాన్ని సాతాను ఒక సాధనంగా వాడుకొని దేవునికి వ్యతిరేకంగా మనల్ని మార్చడానికి ప్రయత్నిస్తున్నాడు, ఏదెను తోటలో అదే జరిగింది (ఆదికాండం 3వ అధ్యాయం).

## కృతజ్ఞతతో కూడిన జీవితం వల్ల వచ్చే ఆశీర్వాదాలు

కృతజ్ఞత అనేది మనల్ని దేవునికి ఎంతో సమీపంగా చేస్తుంది. ఆయన సన్నిధిని అనుభవించిన వారమవుతాం, మనపట్ల ఆయన శ్రద్ధని అనుభవపూర్వకంగా చూస్తాం, ఆయనతో మన సంబంధం బలపడుతుంది. ప్రతివిషయం కొరకు ఆయనను ఎల్లప్పుడూ మహిమపరుస్తాం. పొందుకున్న ఆశీర్వాదాన్ని బట్టి కాక ఆయన గొప్పతనాన్ని, మంచితనాన్ని బట్టి ఆయనను ఘనపరుస్తూ, ఆయనకు లోబడి ఉండడానికి ఇష్టపడతాం.

- కృతజ్ఞత మనల్ని చింత నుండి, ఒత్తిడి నుండి విడిపించి, శాంతినిస్తుంది (ఫిలిప్పీ 4:6-7). దానివలన మనం ఆరోగ్యంగా ఉంటాం, మనలో ఉత్పాదక సామర్థ్యం పెరుగుతుంది.
- కృతజ్ఞత అన్నది మన మీద కంటే దేవుని మీద మన దృష్టి ఉంచేలా తోడ్పడుతుంది.
- కృతజ్ఞత దేవునిపై ఓర్పు, నమ్మకాన్ని పెంపొందిస్తుంది.
- కృతజ్ఞత అనేది సంక్రమించేది, దాని ద్వారా మన చుట్టూ ఉన్నవారు కూడా కృతజ్ఞత కలిగి జీవించడం నేర్చుకొంటారు.
- కృతజ్ఞత మనం ఎంతగా ఆశీర్వదించబడ్డామో గుర్తు చేస్తుంది. కోరికలకంటే పొందిన ఆశీర్వాదాలపై మనం దృష్టి పెడితే సంతోషంగా ఉంటాము.

"ఆనందం మిమ్మల్ని కృతజ్ఞత కలిగి ఉండేలా చేయదు కానీ చేసిన మేలును గుర్తుచేసుకోవడం మిమ్మల్ని కృతజ్ఞత కలిగి ఉండేలా చేస్తుంది. ఆనందం కృతజ్ఞతను అనుసరిస్తుంది" అని ఛార్లెస్ స్విండాల్ అంటాడు.

"కృతజ్ఞతానుభూతి చెంది దానిని వ్యక్తపరచక పోవడం బహుమతిని సిద్ధం చేసి దానిని ఇవ్వకపోవడం లాంటిది." అని విలియం ఆర్థర్ డబ్ల్యు అంటాడు. గనుక ఈ నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న మనం ఒకసారి ఆగి, దేవుడు ఇంతవరకూ చేసిన మేళ్ళన్నింటిని గుర్తు చేసికొని, హృదయపూర్వకంగా ఆయనను స్తుతిద్దాం, ఇతరులతో పంచుకొందాం. అంతేకాదు ఆ కృతజ్ఞత కలిగిన జీవితాన్ని మన స్వభావంగా చేసుకొందాం, మన జీవనశైలిగా మార్చుకొందాం, అనేకులకు ఆశీర్వాదకరంగా జీవిద్దాం.

– ఆర్. సుమ శ్రీనివాస్, స్టాఫ్, గుంటూరు




## క్రీస్తును వెంబడించు

గొంగళి పురుగువంటి నీ జీవితాన్ని
సీతాకోక చిలుకలా మార్చిన దేవుని వాక్యపు
వెలుగులో నడుస్తూ
ఆయన పాదాల చెంత నేర్చుకొంటూ
యేసుకు ప్రతి బింబమై సంపూర్ణంగా సమస్తమును
విడిచిపెట్టి
శ్రమయందు ఆనందిస్తూ
నిన్ను నీవు ఉపేక్షించుకొని ఆయనను వెంబడించు

అంకురిత భావంగల భక్తితో
నూతన స్వభావం కలిగి
జీవిత కాల పోరాటానికి సిద్ధపడి
ప్రథమస్థానం నీ జీవితంలో దేవునికే ఇస్తూ
ఆయనకు ఇష్టంలేని నీ ప్రతి ఇచ్ఛను చంపుకొని
పూర్ణమనస్సుతో ఆయనను వెంబడించు

ఆయన పాదాల చెంత కూర్చుని నేర్చుకొంటూ
ఆయన మెల్లని స్వరం వింటూ
సాత్వీకం కలిగి, వేషధారణను విడిచిపెట్టి
యధార్థ హృదయంతో ప్రతి విషయమందు
పరిశుద్ధత కలిగి ఆయనను వెంబడించు

ఉచితంగానే రక్షణను పొందుకొన్నావు
ఆయన కొరకై జీవించడానికి వెల చెల్లించాల్సిందే
లోకమంతా నిన్ను ద్వేషిస్తున్నప్పటికీ
ప్రవాహానికి ఎదురీదే చేపవలే అలయక నిత్యం
సంతోషంగా ఆయనను వెంబడించు

మనసారా ఆయనను ఆరాధిస్తూ
ఆయన మెల్లని స్వరం వింటూ,
ఆయనతో మాట్లాడుతూ
గొప్ప సాక్ష్యం, సహవాసంతో
ఆత్మల పట్ల తృష్ణ కలిగి
యేసువైపు చూచుచూ
ఓపికగా నిజ శిష్యునివలె ఆయనను వెంబడించు

– హెప్సీబా, నంద్యాల



కథానిక

# నూతన పరచుము

పదేపదే రింగ్ అవుతున్న తన ఫోన్‌ను లిఫ్ట్ చేశాడు అభిషేక్.

హలో, తమ్ముడూ వినోద్!

నమస్తే ఎలా ఉన్నావు, బాగున్నావా?

జనవరి 10వ తేదీన క్వైట్‌టైమ్ మీద మాట్లాడాలి అన్నా! సారీ, తమ్ముడు, ఈ మధ్య క్రిస్మస్ సీజన్ వలన సరిగా క్వైట్‌టైమ్ చేసుకోలేక పోయాను. అంటే... రెగ్యులర్‌గా చేసుకున్నాను గానీ అంత అర్థవంతంగా చేసుకోలేదు, అందుకని టాక్ తీసుకోలేను. ఏమనుకోవద్దు, ఉంటాను అంటూ... తమ్ముడూ నీవు తీసుకోవచ్చు కదా? అని వినోద్‌ను అడిగాడు అభిషేక్.

నావల్ల కాదులేన్నా అని అన్నాడు వినోద్. ఎందుకు అంటే నేను.. నేను.. అంటూ నసగడం ప్రారంభించాడు.

ఏంటి తమ్ముడూ అంటే... విషయం తర్వాత చెబుతాలే అన్న అంటూ ఫోన్ పెట్టేశాడు.

అభిషేక్ ఫోన్లో మాట్లాడిందంతా భార్య శైలజ విని ఒకింత ఆశ్చర్యానికి గురి అవుతుంది.

శైలజ, అది కాదండీ "మీరెందుకు తీసుకోరు? అని అడుగుతుండగా...

అభిషేక్ మధ్యలో తన మాటకు అడ్డుపడి,

చూడు...శ్రీమతి, మనము క్వైట్ టైమ్ సరిగా చేసుకోకుండా దాని మీద మాట్లాడడం ఎంత వరకు సమంజసం? దేవుడు మెచ్చడు కదా! కొంతమంది వాళ్ళు చేయకుండా, వాళ్ళ అనుభవంలో లేకపోయినా చెప్పడం మాత్రం చెబుతారు. నేను అలా చేయను. అందుకనే అంగీకరించ లేదు.

నేను చెప్పేది అదికాదండి! అసలు మీరు ఎందుకు క్వైట్‌టైమ్ సరిగా చేసుకోవడం లేదు? అంటూ అడిగింది. ఆ ప్రశ్న సరిగా వినిపించిందో లేక వినిపించలేదో గానీ సమాధానం లేదు.

సర్లే వెళ్ళు, త్వరగా టిఫిన్ సిద్ధం చేయి, టైమ్ అవుతుంది. అంటూ తన రూమ్ లోనికి వెళ్ళాడు.

సరిగ్గా 9:00 గంటలకు ఆఫీసుకు వెళ్ళిపోతాడు. సమయం 9:45 అవుతుంది. బాసు ఎవరి మీదనో గట్టిగా కేకలు వేస్తుండడం విన్పించింది. కొంచెం లోపలికి తొంగి చూస్తే 'సుధాకర్' మీద బాసు కేకలేస్తున్నాడు.

సుధాకర్ ఓ యంగ్ గ్రాడ్యుయేట్. ఈ ఆరు నెలల క్రితమే తన ఆఫీసులో సహోద్యోగిగా జాయిన్ అయ్యాడు. ఎప్పుడూ బాసుతో మాటలు పడుతూనే ఉంటాడు. ఈ రోజు కొంచెం ఎక్కువగా మాటలు పడినవి.

భోజనం విరామ టైమ్‌లో సుధాకర్, అభిషేక్ కలిసి భోజనం చేసేవారు. ఆ రోజు కూడా ఇద్దరూ కలిసి చేస్తున్నారు.

అభిషేక్, చూడు సుధాకర్, అప్పుడప్పుడు ఆలస్యం ఫర్వాలేదేమో గానీ ఎప్పుడూ ఆలస్యం మంచిది కాదు కదా? అంటుండగా...

సుధాకర్ "అదేమి లేదు అన్న, నేను ఒక్కడినే కాదు కదా, అందరూ లేట్‌గానే వస్తున్నారు. అయినా ఫర్వాలేదు అన్న, అన్నీ పట్టించుకుంటామా, లైట్ తీస్కోవాలి".

అభిషేక్ "తమ్ముడు, సుధాకర్, మనము దేవుని నమ్మిన వ్యక్తులం. మనకు ప్రతిదీ ముఖ్యం, దేవుని నామానికి అవమానాన్ని తీసుకొని రాకూడదు కదా!

సుధాకర్ "ఊరుకోండి అన్న, చిన్న చిన్న విషయాల ను భూతద్దంలో పెట్టి చూస్తారు. అదేమి కాదులే లైట్ తీస్కోండి", బయట పని ఉంది వెళ్ళొస్తాను అన్నా అంటూ బయటకు వెళ్ళాడు.

అభిషేక్‌కి ఏమీ అర్థం కావడం లేదు, ఇందాక వినోద్, ఇప్పుడు సుధాకర్, ఏమిటి ఇలా మాట్లాడుతున్నారు, ఇలా ప్రవర్తిస్తున్నారు.

అభిషేక్ మనస్సులోనే "దేవా, వీరిని నూతన పరచుము" అంటూ ప్రార్థన చేశాడు.

ఆఫీస్ నుండి అభిషేక్ మార్కెట్‌కి వెళ్ళి ఇంటికి వెళ్ళేసరికి సాయంత్రం 6:30 గంటలు అయ్యింది.

ఇంట్లోకి వెళ్తుండగా బయట రెండు చెప్పుల జతలు చూసి ఆగిపోయాడు. లోపల హాల్లో సుధీర్ ఫ్యామిలీ ఉంది. కొంచెం ఇబ్బంది గానే లోపలికి వెళ్ళాడు. సుధీర్ ఇజియఫ్‌కి ఈ మధ్యే వస్తున్నాడు. హాల్లో ఉన్న సుధీర్, తన భార్య లేచి 'వందనాలు అన్నా' అంటూ చేతులు జోడించి చెప్పారు.

అభిషేక్ 'ఫర్వాలేదు, తమ్ముడు. కూర్చోండి' ఎలా ఉన్నారు? పిల్లలు ఎలా ఉన్నారు? అంటూ పల కరించి చేతిలో ఉన్న సంచి కిచెన్లో పెట్టి వచ్చి వాళ్ళతో పాటు కూర్చున్నాడు.

కాసేపటికి శైలజ ముగ్గురికి టీ తెచ్చి ఇచ్చింది. సుధీర్ మాట్లాడడం ప్రారంభించాడంటే గొప్పలు సింహాసనం ఎక్కుతాయి. తన గురించి, తన ఇంటి వారి గురించి, తనకున్న వాటి గురించి, తన పనులు ఇలా నాన్ స్టాప్‌గా చెప్పడం ఆనవాయితి.

ఆలకించాలే కానీ అరగంట అనర్గళంగా తన గొప్పలు ఆపకుండా చెప్పగలడు. తన భార్య కూడా సుధీర్‌కి ఏమాత్రం తీసిపోదు. కుటుంబంగా వస్తారు, మనుష్యులను విసిగిస్తారు, భోజనం చేసి కదులుతారు.

అభిషేక్ నవ్వుతూనే, ఏంటి విషయాలు తమ్ముడూ, అంటుండగానే, సుధీర్ మాటలాడడం ప్రారంభించాడు. తన గురించిన గొప్పలతో ప్రారంభమైన సంభాషణ ఎక్కడ ఆగుతుందో తెలియదు. అలా మాట్లాడుతూనే ఉన్నాడు. ఇజియఫ్ బైబిల్ స్టడీకి వెళ్ళే సమయం అవుతుంది. అభిషేక్ టైమ్ అయి పోతుందనే కంగారు పడుతున్నాడు. మధ్యలో ఇజియఫ్ ఉంది అని చెప్పినా అవేమి పట్టని సుధీర్ ఎట్టకేలకు 8:00 గంటలకు ఆపాడు.

హమ్మయ్య... అనుకుంటూ హడావుడిగా అభిషేక్ కుటుంబంగా ఇజియఫ్ బైబిల్ స్టడీకి వెళ్ళారు. సుధీర్ వాళ్ళు బయట పని ఉంది, ఇజియఫ్‌కి రాలేము అని చెప్పి వెళ్ళి పోయారు.

అభిషేక్, బైక్ మీద ఇజియఫ్ బైబిల్ స్టడికి వెళ్తూ సుధీర్ కుటుంబాన్ని 'నూతన పరచుము' అంటూ మనస్సులో ప్రార్థన చేశాడు.

అభిషేక్ వెళ్ళే సరికి, పాటలు పాడడం అయిపోయింది. బైబిల్ స్టడీ ప్రారంభించారు. బైబిల్ స్టడీ సజావుగా సాగుతుండగా మధ్యలో శ్రీకాంత్ ప్రశ్నతో బ్రేక్ పడింది. శ్రీకాంత్ ఈ మధ్యనే థియాలజీ చదువు పూర్తి చేశాడు. పాత నిబంధన మీద కొంచెం పట్టు ఉన్న వ్యక్తి. ఏదో ప్రశ్నతో తన థియాలజీని చూపించే ప్రయత్నం చేస్తాడు. తనకే తెలుసు అనే దృక్పథం ప్రశ్నలో, తను చెప్పే సమాధానంలో కన్పిస్తుంది.

తన ప్రశ్నలతో, తన సమాధానాలతో బైబిల్ స్టడీని ముందుకు వెళ్ళనియ్యక పోవడం తనకు అలవాటు, మిగతా వారికి తలపోటు. ఎట్టకేలకు బైబిల్ స్టడీ ముగిసింది. బైబిల్ స్టడీ చివర్లో సుధీర్ ఫ్యామిలీ వచ్చింది.

బైబిల్ స్టడీ అయిన తర్వాత సుధీర్, శ్రీకాంత్ కలిసి మాట్లాడుకొంటున్నారు. మాటల పోటీలు ప్రత్యక్షంగా చూసినట్లే. ఎవరికి ఎవరూ తగ్గరు. ఎవరి గొప్పలు వారివే.

అభిషేక్ వారి వైపు చూడలేక, ప్రభువు వైపు చూచి "ప్రభువా, వీరిని నూతన పరచుము" అంటూ మనస్సులో చిన్న ప్రార్థన చేశాడు.

అభిషేక్‌కి ఇజియఫ్ బైబిల్ స్టడీ నుండి ఇంటికి వెళ్ళే సరికి కొంచెము లేట్ అయ్యింది. ఇంటికి

వచ్చిన అభిషేక్ హృదయమంతా చాలా బాధతో నిండిపోయింది. తన తోటి విశ్వాసుల జీవితాల్ని చూసినప్పుడు హృదయం వేదనతో నిండింది. ఇలాంటి వారు దేవుని పరిచర్య ఎలా చేస్తారు? పరిచర్యలో నాణ్యత కోల్పోతున్నాము అంటే ఇలాంటి వారిద్వారానే గదా? వీరిని ఎలా మార్చాలి. లోకంతో రాజీపడిపోకుండా సంపూర్ణంగా దేవునికి సమర్పించుకొనేటట్లు ఎలా చేయాలి? అని ఆలోచిస్తూ నిద్రపోయాడు.

మరుసటి రోజు సెలవు కావడంతో ఆలస్యంగానే నిద్ర లేచాడు.

కొంచెము ఫ్రెష్ అయ్యి క్వైట్ టైమ్ చేసుకుందామని తన బైబిల్, తన నోట్స్ తీసుకొన్నాడు. తన రెగ్యులర్ బైబిల్ పాఠం రోమా 12: 10-20 వచనాలు చదువుకొని ధ్యానిస్తుండగా, అభిషేక్ 16వ వచనం దగ్గర ఆగిపోయాడు.

"మీకు మీరే బుద్ధిమంతులనుకోవద్దు" (16 వచనం చివరి భాగం). ఆ వాక్యాన్ని ఆలోచించడం, అర్థం చేసుకోవడం, అర్థం చేసుకొని, అన్వయించుకొన్నప్పుడు దేవుడు తనలో ఉన్న లోపాల్ని చూపించడం ప్రారంభించాడు. చాలా సేపు పశ్చాత్తాపంతో కూడిన ప్రార్థన చేసుకొన్నాడు.

పుస్తకంలో లియోటాల్‌స్టాయ్ కొటేషన్ ఒకటి ఇలా ఉంది. "ప్రతి వ్యక్తి ఈ ప్రపంచాన్ని మార్చాలనుకొంటాడు గానీ తన్ను తాను మార్చుకోడు. తన్ను తాను మార్చుకొన్న వ్యక్తి తన సమాజంలో మార్పుకు తోడ్పడతాడు".

ఇది నిజమే అనిపించింది. ప్రభువా, వీరిని నూతన పరచుము, అనే ప్రార్థన పోయి "నన్ను నూతన పరచుము" అనే ప్రార్థనగా మారిపోయింది.

అభిషేక్ తన గురించి ఆలోచించడం ఆరంభించాడు. ఇప్పటి వరకు తను మాత్రం బుద్ధిమంతుడిని అనే భ్రమలో బ్రతికినట్లు బట్టబయలవుతుంది. దేవుని వాక్యం మాట్లాడుతుంది. తన జీవితంలో చేసినవి గుర్తుకు వస్తున్నాయి.

ఏముందిలే, చిన్నవేలే అనే పాపాలు గుర్తుకు వస్తున్నాయి అభిషేక్‌కి "తన నిర్లక్ష్యం, తన ఆలస్యం, తన వేషధారణ, తీర్పు తీర్చే మనస్సు, తన మాట తీరు, తన ఆత్మీయ గర్వం, తప్పులు ఎత్తి చూపడం, తన అబద్ధాలు, అలవాట్లు" ఇలా ప్రతిదీ గుర్తు వస్తుంది.

కొత్త సంవత్సరంలోకి ప్రవేశిస్తూ, గత సంవత్సరాన్ని నెమరువేసుకొంటూ స్వపరీక్ష కోసం కొన్ని ప్రశ్నలు వేసుకొన్నాడు.

1. గత సంవత్సరం అంతా నేనేదైనా రహస్య పాపాన్ని చేస్తూ వచ్చానా?
2. వాక్యపఠనాన్ని, ప్రార్థనను నిర్లక్ష్యం చేశానా?
3. నా భార్యకి/నా భర్తకి నమ్మకంగా ఉన్నానా?
4. నా తల్లిదండ్రులను, గ్రాడ్యుయేట్స్‌ను, సంఘ కాపరిని, సభ్యులను గౌరవిస్తున్నానా? వారి కోసం క్రమం తప్పకుండా ప్రార్థిస్తున్నానా?
5. నా ఉద్యోగంలో సక్రమంగా ఉన్నానా?
6. సహవాసాన్ని/సంఘాన్ని నిర్లక్ష్యం చేశానా?
7. తోటి విశ్వాసి ఎవరిమీదైనా కోపం పెంచుకున్నానా?
8. "నీ కంటే నేనే మెరుగు" అనే వైఖరి ప్రదర్శించానా? లేక ప్రభువు వలె తగ్గింపు వైఖరిని చూపించానా?
9. నా సమయం, సంపద, తలాంతులు దేవుని మహిమకోసం ఖర్చు పెట్టానా?
10. నేను ఒకరినైనా దేవునిలో నడిపించానా?

ఈ ప్రశ్నలు అభిషేక్ తనకు తాను వేసుకొని తాను ఎంత నూతన పరచబడాలో అర్థమై అక్కడనే దేవునికి అప్పగించుకున్నాడు. "నన్ను నూతన పరచుము, దేవా" అంటూ ఎంతో పశ్చాత్తాపంతో ప్రార్థన చేశాడు. ఈ నూతన సంవత్సరంలో నూతన జీవితాన్ని ఇవ్వు ప్రభువా అంటూ ప్రాధేయపడ్డాడు.

అభిషేక్ గంటన్నర సేపు తన గదిలో ఉండిపోయాడు. చివరికి తన రూమ్‌లో నుండి నూతనత్వంతో బయటికి వచ్చాడు. ఈ నూతన సంవత్సరంలో తన జీవితం ద్వారా దేవున్ని మహిమ పరచాలనే దృఢ నిశ్చయంతో ఉన్నాడు.

అభిషేక్ చాలా సంతోషంగా ఉన్నాడు, ముఖం కూడా తేజస్సుగా ఉంది. శైలజకి ఏం జరిగిందో అర్థం కాలేదు కానీ అభిషేక్‌లోని సంతోషాన్ని చూసి తాను సంతోషపడింది.

**- యం. గాలెయ్య,** భీమవరం





# మన లక్ష్యం

"ప్రతిదానికి సమయము కలదు..ఏడ్చుటకు నవ్వుటకు, దు:ఖించుటకు, నాట్యమాడుటకు" (ప్రసంగి 3:1,4) అని జ్ఞాని తెలియజేస్తున్నాడు. కాని అపరిశుద్ధంగా ఉండడానికి సమయంలేదు, ఒక్కరోజుకూడా లేదు. ఎల్లప్పుడు పరిశుద్ధంగా ఉండాలని, పాపంతో పోరాడాలని దేవుడు ఆశిస్తున్నాడు. నూతన జన్మ ఒక క్షణంలో జరుగుతుంది కానీ పరిశుద్ధతలో ఎదగడానికి జీవితకాలం పడుతుంది. గనుక అనుదిన జీవితంలో పరిశుద్ధత కొరకు గొప్ప సేవకుడైన జాన్ ఛార్లెస్ రైలీ గారు తెలియజేసిన విషయాలను గమనిద్దాం.

1. లేఖనాల్లో తెలియజేయబడిన దేవుని మనస్సుకు అనుగుణంగా జీవించే అలవాటునే పరిశుద్ధత అంటాము. అలాగే ఈ లోకంలో ఉన్న ప్రతి దానిని దేవుని వాక్యంతో తప్పా, ఒప్పా అన్న విషయాన్ని పరీక్షించడం.
2. ఒక పరిశుద్ధుడు తనకు తెలిసిన పాపాన్ని వదిలిపెట్టడానికి, తనకు తెలిసిన ఆజ్ఞలన్నిటికీ లోబడడానికి ఇష్టపడతాడు.
3. యేసుక్రీస్తువలె జీవించడానికి ఒక పరిశుద్ధుడు శాయశక్తులా కృషి చేస్తాడు. "క్రీస్తు నా స్థానంలో ఉంటే ఏమి మాట్లాడుతారు/ఏమి చేస్తారు?" అనే ప్రశ్నలను ప్రతి సందర్భంలో వేసుకుంటాడు.
4. దీనత్వం, దీర్ఘశాంతం, మంచితనము కలిగి సహనము, భావోద్రేకాలను, నోటిని అదుపులో పెట్టుకోవడం వంటి లక్షణాలను కలిగి ఉండడానికి ఒక పరిశుద్ధుడు కృషి చేస్తాడు, ఫలిస్తాడు, సహిస్తాడు, తగ్గించుకుంటాడు, హక్కుల కోసం పోరాటాలు చేయడు.
5. తనను తాను ఉపేక్షించుకోవడం, మితంగా జీవించడం వంటి లక్షణాలను ఒక పరిశుద్ధుడు అలవర్చుకుంటాడు. తన శరీర వాంఛలను చంపి వేయడానికి, కామాభిలాషలను సిలువ వేయడానికి తీవ్రంగా శ్రమిస్తాడు. ప్రతి విధమైన చెడుకి, మురికిని, ఆత్మకు అంటే కళంకానికి భయపడతాడు. తనను ఆకర్షణకు గురిచేసే ప్రతి దానికి దూరంగా ఉంటాడు.
6. దాతృత్వం, సహోదర ప్రేమను ఒక పరిశుద్ధుడు కలిగి ఉంటాడు. ఇతరుల పట్ల దయ, కరుణలను చూపిస్తాడు. తన తరము వారికి సేవచేయడానికి, వారికి ఉపయోగపడడానికి కృషి చేస్తాడు.
7. ఒక పరిశుద్ధుడు దేవుని భయంతో జీవిస్తాడు. బానిస చూపే భయం కాదు. ఒక బాలుడు తన తండ్రి పట్ల ప్రేమ, గౌరవంతో చూపే భయం.
8. ఒక పరిశుద్ధుడు దీనత్వాన్ని కలిగి ఉంటాడు. అందరినీ తన కన్నా యోగ్యులుగా భావిస్తాడు. లోకంలో కన్నా, తన హృదయంలోనే ఎంతో చెడు ఉన్నదని గ్రహిస్తాడు.
9. ఒక పరిశుద్ధుడు తన పనులు, బాధ్యతల్లో ఎంతో నమ్మకంగా ఉంటాడు. బాధ్యతారహితంగా ఉండే ఇతరుల్లాగా అతను పని చేయడు.
10. ఒక పరిశుద్ధుడు ఆధ్యాత్మిక మనస్సుతో జీవిస్తాడు. భూ సంబంధమైన వాటిమీద కాకుండా, పరలోక సంబంధమైన విషయాలపైనే మనస్సు పెడతాడు. అలాగని తన జీవితానికి సంబంధించిన విషయాలను నిర్లక్ష్యం చేయడు.

1 యోహాను 3:2-3లో *"ప్రియులారా, ఇప్పుడు మనము దేవుని పిల్లలమై ఉన్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంకా ప్రత్యక్షపరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన ఉన్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము.* ***ఆయనయందు ఈ నిరీక్షణ పెట్టుకొనిన ప్రతివాడును ఆయన పవిత్రుడైయున్నట్టుగా తన్ను పవిత్రునిగా చేసుకొనును****".* అంత్య దినమున మనం ఎలా ఉంటామనే విషయం మనకు పూర్తిగా తెలియదు గాని క్రీస్తుపోలికలో ఉంటామన్న విషయం మాత్రం ఖచ్చితంగా చెప్పగలము. ఈ నిరీక్షణ కలిగిన ప్రతి విశ్వాసి ఆయన పవిత్రుడై ఉన్నట్లు తన్నుతాను పవిత్రునిగా చేసుకొంటాడు. గనుక మనకు ఈ లోకంలో పరిశుద్ధంగా జీవించడం కన్నా ప్రాముఖ్యమైన లక్ష్యం వేరే ఏదీ ఉండదు, ఉండకూడదు.

**- విజె డెస్క్**

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**
**Date of Printing: 25-12-2024**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**
Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508




# జాగ్రత్త-జర జాగ్రత్త



సంవత్సరం కొత్తదేమో కానీ
మనిషి పాతే
మనసూ పాతదే
మరలుకొలిపే ఆశలూ పాతవే
జాగ్రత్త-జర జాగ్రత్త
హాయిని తలచి
సోయిని మరచి
కోరికల మదిలో
కోట్ల ఆశల పొదిలో
హృది నచ్చినవన్నీ చేస్తుంటే
న్యాయాధిపతికికొక రోజు
లెక్క చెప్పాలి
జాగ్రత్త-జర జాగ్రత్త

ఇంకా ఏమీరాయని
పుస్తకంలా ఉన్న
కొత్త సంవత్సరం
తనలో ఏం రాస్తామో అని
రోజుల పేజీలు తెరిచి
ఆశగా ఎదురు చూస్తుంది
కొత్త కలాలలో
సరికొత్త సిరా నింపుకొని
కొంగొత్త అధ్యాయాలు రాస్తామో
పాతరేయాల్సిన పాత చరితనే
తిరిగి రాస్తామో
మన చేతుల్లోనే, మన చేతల్లోనే...

నిన్నటి ఏడాది ఆరంభాన
అట్టహాసంగా తీసుకున్న నిర్ణయాలు
ఆర్భాటంగా చేసిన శపథాలు
ఎక్కడ పారేసుకున్నామో...
ఒక్కసారి వెనక్కి వెళ్ళి వెతకాలి
సొంతపనుల పొరల్లో కొన్ని
సోమరితనపు శిలాఫలకాల్లో మరికొన్ని
శిధిలాలైనట్టున్నాయి
శిలాజాలైనట్టున్నాయి...
రద్దీ పనులను రవ్వంత రద్దు చేసుకొని
లోతుగా తవ్వి వెలికి తీయాలి
ఆనక...
అన్నిటినీ ఆవిష్కరించుకోవాలి
మరిచిపోలేనంతగా
మళ్ళీ కొత్తగా...!

– గొంగటి మేరి జాయ్, ఆదోని